

TGTEL/25/A1713

సూర్య రేఖ
తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 145 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | బుధవారం 10 జూన్ 2026 | వెల : 4/-



### భారత రాజకీయాల్లో
## అజేయ శకం..

- నెహ్రూ రికార్డు బద్దలు.. ప్రధాని మోదీ భావోద్వేగ పోస్ట్!
- భారత రాజకీయ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం లిఖించబడింది
- సరిగ్గా 12 ఏళ్ల క్రితం 2014 మే 26న దేశ ప్రధానిగా సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించిన నరేంద్ర మోదీ, నేడు అత్యంత అరుదైన చారిత్రక మైలురాయిని అధిగమించారు

### ఇందిరమ్మ రాజ్యం వస్తేనే
# మహిళలకు గుర్తింపు



- సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మహిళాశక్తి సభ
- స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- జెండా ఊపి ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన సీఎం
- స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు

హైదరాబాద్

మన సంస్కృతి, సంప్రదాయంలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి మహిళాశక్తిని ప్రపంచానికి చాటిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుందని తెలిపారు. స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేశారు. జెండా ఊపి ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో పాల్గొని రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుందని అన్నారు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా అని ప్రశ్నించారు. మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిందని పేర్కొన్నారు. అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారని, వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలని, ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనదని కొనియాడారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని పరిపాలన చేస్తున్నామని అన్నారు. అమెరికాలో మహిళలకు - మిగతా3లో

### రోడ్లు భవనాల శాఖ
## ఈఎన్‌సీ నివాసాల్లో ఏసీబీ సోదాలు

- భారీగా నగదు, బంగారం, వెండి స్వాధీనం
- ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలపై ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ నివాసాల్లో ఏసీబీ సోదాలు
- హైదరాబాద్, నిజామాబాద్ నివాసాల్లో తనిఖీలు
- భారీగా నగదు, బంగారం, వెండి, ఆస్తుల పత్రాలు స్వాధీనం

హైదరాబాద్

ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలతో రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్ నివాసంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్ ప్రాంతాల్లో మొత్తం 15 చోట్ల ఏసీబీ తనిఖీలు కొనసాగిస్తోంది. ఇవాళ రాత్రి వరకు అవినీతి నిరోధక శాఖ అధికారుల సోదాలు కొనసాగే అవకాశం ఉంది. ఇవాళ ఉదయం 6 గంటల నుంచి ఏసీబీ అధికారులు బృందాలుగా విడిపోయి - మిగతా3లో




## టెర్రర్ నెట్‌వర్క్‌పై ఎన్ఐఏ నజర్

- హరియాణా, పంజాబ్‌లోని 18 చోట్ల సోదాలు
- నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) దూకుడు
- పాక్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాది షహజాద్ భట్టికి సంబంధించిన మూడు కేసుల్లో పంజాబ్, హరియాణాలో దాడులు
- పలు ఆధారాలు స్వాధీనం

### అయోధ్య రామమందిరానికి రూ.500 కోట్లకు పైగా విరాళాలు

- రోజుకు సగటున రూ.8 లక్షల ఆదాయం
- ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగినప్పటి నుంచి సుమారు 15 కోట్లకు పైగా ప్రజల ఆలయ సందర్శన
- ఒక్కో భక్తుడి నుంచి సగటున రూ.33 కంటే ఎక్కువ విరాళం



### సరికొత్త రాజకీయ
# సమీకరణాలు

- పార్లమెంటులో 2/3 మెజార్టీ సాధించే దిశగా ఎన్డీఏ
- కీలక బిల్లుల ఆమోదానికి మోదీ సర్కార్ ప్లాన్?!
- టీఎంసీ ఎంపీల తిరుగుబాటుతో పాటు డీఎంకే ఎంపీల మద్దతు కోరే అవకాశం
- మోదీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వచ్చే వర్షాకాల సమావేశాల్లోనే మళ్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం



హైదరాబాద్

తమిళనాడు, పశ్చిమ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేశ రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నారు. ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల తిరుగుబాటు సరికొత్త సమీకరణాలకు తెరలేపింది. ఈ పరిణామాలు కేంద్రంలోని చీణూ ప్రభుత్వానికి భారీ ఊరటనిచ్చేలా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే మోదీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వచ్చే వర్షాకాల సమావేశాల్లోనే మళ్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' వంటి కీలక బిల్లులను ఆమోదించుకునేందుకు చర్యలు - మిగతా2లో

## దేశ భద్రతకు వ్యూహాత్మక సొరంగం

- జోజిలా టన్నెల్ చివరి బ్లాస్ట్ విజయవంతం
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మిస్తున్న జోజిలా టన్నెల్‌లో తుది బ్రేక్‌త్రూ పూర్తి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో చివరి బ్లాస్టింగ్ నిర్వహణ
- ఇప్పటికే 85 శాతం పనులు





## రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించాం

- ధాన్యం సేకరణలో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని ప్రకటన
- పక్క రాష్ట్రాలు తమ కన్నా తక్కువ కొన్నాయని వెల్లడి

### నార్త్ జనానికి దూరమౌతున్న
# కాంగ్రెస్

- ముఖ్యంగా ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన, కేంద్రం నుంచి వచ్చే నిధులు, పన్నుల పంపిణీలో జరుగుతున్న అసమానతలపై ఆయన ఎక్కుపెట్టిన విమర్శలు జాతీయస్థాయిలో హాట్ టాపిక్‌గా మారాయి.
- ఒక జాతీయ పార్టీ తరపున ముఖ్యమంత్రిగా ఉంటూ ఇలాంటి ప్రాంతీయ సెంటిమెంట్‌ను, ముఖ్యంగా ఉత్తరాది వర్సెస్ దక్షిణాది వాదాన్ని లేవనెత్తడం వెనుక కాంగ్రెస్ పార్టీ మారుతున్న అంతర్గత రాజకీయ సమీకరణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.
- గత కొన్ని ఎన్నికల సరళిని పరిశీలిస్తే, ఉత్తరాది రాష్ట్రాలలో కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో పుంజుకోలేకపోతోంది



హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇటీవల జాతీయ వేదికలపై దక్షిణాది ఆత్మగౌరవ వాదాన్ని అత్యంత అగ్రెసివ్‌గా వినిపిస్తూ దేశ రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపారు. ముఖ్యంగా ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన , కేంద్రం నుంచి వచ్చే నిధులు , పన్నుల పంపిణీలో జరుగుతున్న అసమానతలపై ఆయన ఎక్కుపెట్టిన విమర్శలు జాతీయస్థాయిలో హాట్ టాపిక్‌గా మారాయి. మేము కేవలం పన్నులు చెల్లిస్తూ, ఢిల్లీకి సలాం కొట్టే ద్వితీయ శ్రేణి పౌరులం కాబోం అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కేవలం ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవేదన మాత్రమే కాదు.. ఒక దీర్ఘకాలిక రాజకీయ వ్యూహంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక జాతీయ పార్టీ తరపున ముఖ్యమంత్రిగా ఉంటూ - మిగతా3లో

# దేశ భద్రతకు వ్యూహాత్మక సొరంగం

దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగిన జోజిలా టన్నెల్ నిర్మాణం చరిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. జమ్ముకశ్మీర్‌లోని భారీ సొరంగ నిర్మాణంలో తుది బ్రేక్‌త్రూ బ్లాస్టింగ్ విజయవంతంగా పూర్తయింది. దశాబ్దాలుగా కశ్మీర్ లోయ, లద్దాఖ్ మధ్య ఏడాది పొడవునా రవాణా సౌకర్యం కల్పించాలనే కల సాకారానికి ఇది కీలక అడుగుగా నిలిచింది. లద్దాఖ్‌లోని మీనామార్గ్ ఈస్ట్ పోర్టల్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రిమోట్ బటన్ నొక్కి చివరి పేల్చివేత ప్రక్రియను ప్రారంభించారు. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. సొరంగం రెండు వైపులను కలిపే చివరి 2.5 మీటర్ల రాతి పొరను పేల్చివేయడంతో బ్రేక్‌త్రూ విజయవంతమైంది.



### ప్రజలకు అందుబాటులోకి అప్పుడే

ఈ సందర్భంగా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రణాళికలో నిర్ణయించిన గడువు కంటే ఆరు నెలల ముందుగానే ఈ కీలక దశను పూర్తి చేశారు. నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (చీఎ×ణజూ) పర్యవేక్షణలో సాగుతున్న ఈ ప్రాజెక్టులో ఇప్పటికే 85 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను పూర్తి చేసి 2028 ఫిబ్రవరి నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

సముద్రమట్టానికి సుమారు 11,578 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న జోజిలా టన్నెల్ ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో ఉన్న సింగిల్ ట్యూబ్, ద్విముఖ రహదారి సొరంగంగా గుర్తింపు పొందనుంది. మొత్తం 13.153 కిలోమీటర్ల పొడవున్న ఈ టన్నెల్ కశ్మీర్‌లోని సోన్‌మార్గ్ సమీపంలోని బాల్తాల్ ప్రాంతాన్ని, లద్దాఖ్‌లోని ద్రాస్- కార్గిల్ సమీపంలోని మీనామార్గ్‌తో అనుసంధానిస్తుంది. జోజిలా పాస్ ప్రాంతంలో ప్రతి ఏడాది శీతాకాలంలో భారీ మంచు కురవడం వల్ల రహదారి రవాణా నెలల తరబడి నిలిచిపోతుంది. దీంతో లద్దాఖ్ ప్రాంతం దేశంలోని మిగతా ప్రాంతాలతో సంబంధాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది.

### కేవలం 15 నిమిషాల్లో

టన్నెల్ అందుబాటులోకి వస్తే ఏడాదంతా అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో రాకపోకలు సాగేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం శ్రీనగర్ నుంచి లద్దాఖ్‌కు జోజిలా మార్గంలో ప్రయాణించడానికి గంట నుంచి గంటన్నర వరకు సమయం పడుతోంది. మంచు, కొండచరియలు, ట్రాఫిక్ అంతరాయాల కారణంగా మరింత ఆలస్యం కూడా అవుతోంది. అయితే జోజిలా టన్నెల్ ప్రారంభమైతే ఈ ప్రయాణ సమయం కేవలం 15 నిమిషాలకు తగ్గిపోతుందని అధికారులు చెబుతున్నారు. ఇది ప్రజల ప్రయాణాన్ని సులభతరం చేయడమే కాకుండా ఆర్థిక కార్యకలాపాలకు కొత్త ఊపునివ్వనుంది. ఈ టన్నెల్ వ్యూహాత్మకంగా కూడా అత్యంత కీలకమైనది. 1999 కార్గిల్ యుద్ధం సమయంలో లద్దాఖ్ ప్రాంతానికి ఏడాదంతా రహదారి అనుసంధానం అవసరం ఎంత ముఖ్యమో దేశం గుర్తించింది. టన్నెల్ పూర్తయిన తర్వాత సరిహద్దు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సైనిక బలగాలకు అవసరమైన సామగ్రి, సిబ్బంది వేగంగా తరలించే అవకాశం ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో సైనిక అవసరాలకు ఇది కీలక మౌలిక సదుపాయంగా మారనుంది.

### వింటర్ టూరిజం అభివృద్ధికి దోహదం

జియోటెక్నికల్ నిపుణుడు జనక్ సింగ్ రాథోడ్ మాట్లాడుతూ, ఇంత ఎత్తులో ఇలాంటి భారీ టన్నెల్ నిర్మాణం దేశానికి గర్వకారణమన్నారు. పర్యాటక రంగానికి ఇది పెద్ద ఊతమిస్తుందని తెలిపారు. గతంలో శీతాకాలంలో లద్దాఖ్ చేరుకోలేక పర్యాటకులు శ్రీనగర్‌లోనే చిక్కుకుపోయేవారని, ఇకపై ఏడాదంతా లద్దాఖ్‌ను సందర్శించే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా వింటర్ టూరిజం అభివృద్ధికి ఈ టన్నెల్ దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు ఇంజినీర్లు తెలిపిన వివరాల ప్రకారం, టన్నెల్ నిర్మాణంలో అత్యాధునిక న్యూ ఆస్ట్రియన్ టన్నెలింగ్ మెథడ్‌ను ఉపయోగించారు. హిమాలయ ప్రాంతంలోని క్లిష్ట భౌగోళిక పరిస్థితులను అధిగమిస్తూ ఈ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. టన్నెల్‌లో గాలి ప్రసరణ, విద్యుత్ సరఫరా, అగ్నిమాపక వ్యవస్థలు, భద్రతా ఏర్పాట్లు, అత్యవసర సేవలకు అనుగుణంగా ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు.

### రూ.6,500 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు

టన్నెల్ పైభాగం నుంచి లోపలికి మూడు నిలువు షాఫ్టులను నిర్మిస్తున్నారు. వీటి ద్వారా గాలి, వెలుతురు ప్రసరణతో పాటు ప్రమాదాలు సంభవించినప్పుడు సహాయక చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది. అప్రోచ్ రోడ్లు, వంతెనలతో కలిపి ఈ మొత్తం ప్రాజెక్టు పొడవు దాదాపు 31 కిలోమీటర్లుగా ఉంటుంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (వీజు×ూ) ఈ భారీ ప్రాజెక్టును నిర్మిస్తోంది. సుమారు రూ.6,500 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత కశ్మీర్–లద్దాఖ్ ప్రాంతాల మధ్య సామాజిక, ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలుకుతూ జోజిలా టన్నెల్ నిర్మాణం తుది దశకు చేరుకోవడం దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో మరో చరిత్రాత్మక అధ్యాయంగా నిలవనుంది.

# సరికొత్త రాజకీయ సమీకరణాలు

-మొదటిపేజీ తరువాయి

చేపట్టింది. వీరి సాయంతో ఈ బిల్లులను ఆమోదం పొందేలా ప్రణాళికలు రచిస్తోంది. 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల సరిహద్దులను మార్చేందుకు ఉద్దేశించిన డిలిమిటేషన్ బిల్లు ఇటీవల లోక్‌సభలో వీగిపోయింది. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజార్టీ ఎన్డీఏకు లేకపోవడంతో బిల్లు ఆమోదం పొందలేదు. ఫలితంగా ఈ బిల్లుతో ముడిపడి ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా వీగిపోయింది. అయితే ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. ౹వీజకి మొత్తం 29 మంది ఎంపీలు ఉండగా, ఆ పార్టీ తిరుగుబాటు ఎంపీ కాకోలి ఘోష్ దస్తీదార్ తమకు లోక్‌సభలో 20 మంది ఎంపీల మద్దతు ఉందని ప్రకటించడం సంచలనంగా మారింది. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం పార్టీ చీలికకు అవసరమైన సంఖ్య కంటే ఒక సీటు ఎక్కువే ఉంది. ఈ రెబెల్ ఎంపీలంతా కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ నివాసంలో సమావేశమై చీణూకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. ఒకవేళ 20 మంది ౹వీజ రెబల్ ఎంపీలు ప్రత్యేక కూటమిగా ఏర్పడి ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇస్తే లోక్‌సభలో ఎన్డీఏ బలం 300 మార్కును దాటనుంది.

### డీఎంకే నుంచి కూడా షరతులతో కూడిన మద్దతు పొందేందుకు చర్చలు

మరోవైపు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీ కాంగ్రెస్ వైఖరిపై నిరసనగా ఇండీ కూటమి నుంచి వైదొలిగింది. ఈ నేపథ్యంలో అవకాశాన్ని ఉపయోగించి డీఎంకే నుంచి కూడా షరతులతో కూడిన మద్దతు పొందేందుకు బీజేపీ చర్చలు జరుపుతోంది. ఒకవేళ ఇది సఫలమైతే ఎన్డీఏకు మూడింట రెండు వంతుల మెజార్టీ మరింత సులువుగా మారుతుంది. కాంగ్రెస్? తీరుతో విసిగిపోయిన డీఎంకేకు చెందిన 22 మంది ఎంపీలు మద్దతు ఇచ్చే అవకాశం పెరిగిందని తెలుస్తోంది.

### మ్యాజిక్ ఫిగర్‌కు కేవలం 12 ఓట్ల దూరంలో ఎన్డీఏ

కాగా, ప్రస్తుతం లోక్‌సభలో 543 స్థానాలకు ముగ్గురు ఎంపీల మరణంతో మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా మూడింట రెండు వంతుల మెజార్టీకి 360 మంది ఎంపీల మద్దతు అవసరం ఉంటుంది. అటు ప్రస్తుతం ఎన్డీఏ బలం 293 కాగా 20 మంది ౹వీజ రెబెల్ ఎంపీల మద్దతుతో 313కు చేరనుంది. వీరితో పాటు 22 మంది ఎంపీలు ఉన్న డీఎంకే మద్దతు కూడా లభిస్తే చీణూ బలం 335కు చేరుతుంది. వీరితో పాటు ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (ఖదీ)కు చెందిన తొమ్మిది మంది ఎంపీలపైనా ఎన్?డీఏ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వారిలో కూడా చీలిక ఏర్పడితే అదనంగా మరో ఆరుగురు ఎంపీల మద్దతుతో మొత్తం సంఖ్య 341కి చేరే అవకాశం ఉంది. ఇటీవల కీలక బిల్లుల సమయంలో క్రాస్ ఓటింగ్‌ను దృష్టిలో పెట్టుకుంటే చీణూకు 348 మంది ఎంపీల మద్దతు లభిస్తుందనే అంచనా వేస్తున్నారు. ఫలితంగా మ్యాజిక్ ఫిగర్ అయిన 360కి ఎన్డీఏ కేవలం 12 ఓట్ల దూరంలో నిలవనుంది. అయితే, మిగిలిన ఈ కొద్దిపాటి వ్యత్యాసాన్ని చిన్న పార్టీలు, స్వతంత్రులు ద్వారా అధిగమించవచ్చని బీజేపీ ధీమాతో ఉంది.

### రాజ్యసభలోనూ ఎన్డీఏకు మూడింట రెండు వంతుల మెజార్టీ!

మరోవైపు రాజ్యసభలోనూ ఎన్డీఏ మూడింట రెండు వంతుల మెజార్టీకి చేరువవుతోంది. రాజ్యసభలో టీఎంసీకి ఉన్న 13 మంది ఎంపీల్లో సుఖేందు శేఖర్ రాయ్ ఇప్పటికే రాజీనామా చేశారు. ఆయన త్వరలోనే బీజేపీ తరపున మళ్లీ రాజ్యసభకు ఎన్నికయ్యే అవకాశం ఉంది. మిగిలిన వారిలో మరికొందరు టీఎంసీ ఎంపీలు కూడా రాజీనామా చేసి, ఉపఎన్నికల ద్వారా బీజేపీ తరపున రాజ్యసభలో అడుగుపెట్టే యోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఎగువసభలో ఎన్డీఏ బలం ఇప్పటికే 150 దాటింది. అక్కడ ణవీఖకు ఉన్న 8 మంది ఎంపీలు కూడా మద్దతిస్తే, మూడింట రెండు వంతుల మెజార్టీ మార్కు అయిన 164 ను అందుకోవడం ఎన్డీఏకు నల్లేరుపై నడకే కానుంది. ఈ నేపథ్యంలో వచ్చే వర్షాకాల సమావేశాల్లో అత్యంత కీలకమైన బిల్లులను తీసుకురావడానికి చీణూ ప్రభుత్వం కసరత్తు చేస్తోందని సీనియర్ బీజేపీ నాయకుడు ఒకరు తెలిపారు. ఇదిలా ఉండగా, రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించడానికి ప్రత్యేక మెజారిటీ అవసరం. దీని ప్రకారం, సభలో మొత్తం సభ్యుల్లో కనీసం సగం మంది హాజరు కావాలి. హాజరై ఓటు వేసిన వారిలో మూడింట రెండు వంతుల మెజారిటీ లభిస్తేనే బిల్లు ఆమోదం పొందుతుంది. ఏప్రిల్?లో జరిగిన ఓటింగ్ సమయంలో 528 మంది ఎంపీలు హాజరయ్యారు. దీనివల్ల మూడింట రెండు వంతుల మెజారిటీకి అవసరమైన సంఖ్య 352గా నిర్ణయమైంది. ఈ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు వచ్చాయి. ఫలితంగా 54 ఓట్ల తేడాతో బిల్లు వీగిపోయింది.

# 12 న్యూక్లియర్ ఆయుధాలు మోహరింపు ఇండియా వ్యూహాత్మక మార్పు!

**న్యూఢిల్లీ:** అణ్వాయుధ విధానానికి సంబంధించి ఇండియా ముఖ్యమైన అణు వ్యూహాత్మక మార్పుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో తొలిసారిగా 12 అణ్వాయుధాలను మోహరించిందంటూ అంతర్జాతీయ పరిశోధన సంస్థ (సిప్రి) రిపోర్ట్ సంచలనంగా మారింది. అణ్వాయుధ సామర్థ్యాన్ని పెంచుకునే క్రమంలో ఇప్పటికే దేశం వద్ద 190 అణ్వాయుధాలుఉన్నాయని ప్రపంచంలోని అగ్రశ్రేణి ఆయుధ పర్యవేక్షణ సంస్థ ఈ నివేదిక తాజాగా విడుదల చేసింది. స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ తాజా నివేదిక ప్రకారం భారతదేశం మొట్టమొదటి సారిగా 12 అణ్వాయుధాలను మోహరించింది. భారతదేశం తన దశాబ్దాల కాలపు అణువిధానాన్ని పక్కనబెట్టి, తొలిసారిగా 12 అణు వార్‌హెడ్‌లను వ్యూహాత్మకంగా మోహరించింది. గతంలో అణు వార్‌హెడ్‌లను, వాటిని ప్రయోగించే క్షిపణులను వేర్వేరు నిల్వ కేంద్రాలలో భద్రపరిచే విధానాన్ని (ూవజ్ఘుతీఛ్‌వ హ్‌శీతీఘ్రవ ూశీశ్రీఱఎఎ) భారత్ అనుసరించేది. అయితే ఇప్పుడు వాటిని సిద్ధంగా ఉంచడం ద్వారా దేశ రక్షణలో ఉన్నత స్థాయి సంసిద్ధతకు సంకేతమని తెలిపింది. శాంతిసమయంలో కూడా క్షిపణులను సిద్ధంగా ఉంచడం, సముద్రంలో నిరంతర నిఘా లాంటి చర్యలు భారతదేశ రక్షణ సంసిద్ధతను సరికొత్త స్థాయికి తీసుకెళ్లాయని నివేదిక వెల్లడిస్తోంది. అయితే దశాబ్దాలుగా అణ్వాయుధాలను, వాటిని ప్రయోగించే వ్యవస్థలను వేర్వేరు నిల్వ కేంద్రాలలో ఉంచే విధానానికి బదులుగా ఇది విరుద్ధమైన చర్య అని పేర్కొంది. నివేదికలోని ముఖ్యాంశాలు




భారత అణు చరిత్రలో ఈ వార్‌హెడ్‌లను కేవలం నిల్వ ఉంచడమే కాకుండా, ప్రయోగానికి సిద్ధంగా ఉన్నట్లు వర్గీకరించడం ఇదే మొదటిసారి. ఈ 12 వార్‌హెడ్‌లను క్షిపణులతో అనుసంధానించడం లేదా సముద్రగర్భ నిఘా నిర్వహించే అణు జలాంతర్గాములపై ఉంచడం ద్వారా క్షేత్రస్థాయి దళాల వద్ద సిద్ధంగా ఉంచారు. 2026 జనవరి నాటికి భారతదేశం వద్ద ఉన్న మొత్తం అణు ఆయుధాల సంఖ్య 190కి చేరిందని అంచనా (గత ఏడాదితో పోలిస్తే స్వల్పంగా పెరిగింది). ఇవి వైమానిక, భూతల మరియు సముద్ర రక్షణ వ్యవస్థలతో అనుసంధానించబడి ఉన్నాయి.

### "నో ఫస్ట్ యూజ్" విధానం

అణ్వాయుద విధానంలో వ్యూహాత్మక మార్పు జరిగినప్పటికీ, ఇండియా తన ప్రాథమిక అణు విధానమైన "నో ఫస్ట్ యూజ్" (మొదటగా అణు దాడి చేయకూడదు) అనే సూత్రానికే కట్టుబడి ఉంది. శత్రు దేశాలు అణు దాడికి పాల్పడితే మాత్రమే, ప్రతీకార చర్యగా మాత్రమే, భారత్ తన అణు ఆయుధాలను ఉపయోగిస్తుంది. అంతేకాదు భారతదేశం పమర్ధవంతమైన అణ్వాయుధాలను కలిగి ఉంది. ఈ సామర్థ్యం ఆయుధ పోటీలో పాల్గొనడానికి కాకుండా, కేవలం దురాక్రమణదారులను నిరోధించడానికే రూపొందించబడింది. భారత్ అణుసామర్థ్యం పరిమితమైనప్పటికీ, దీన్ని ఆయుధాల పోటీ కోసం కాకుండా, దేశ రక్షణ కవచంగా మాత్రమే భావిస్తుంది.

## భారత రాజకీయాల్లో అజేయ శకం..

భారత రాజకీయ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం లిఖించబడింది. సరిగ్గా 12 ఏళ్ల క్రితం 2014 మే 26న దేశ ప్రధానిగా సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించిన నరేంద్ర మోదీ, నేడు అత్యంత అరుదైన చారిత్రక మైలురాయిని అధిగమించారు. స్వతంత్ర భారతదేశంలో అత్యధిక కాలం పాటు నిరంతరాయంగా అధికారంలో కొనసాగిన ఎన్నికైన ప్రధానిగా సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఈ క్రమంలో భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న సుదీర్ఘ కాలపు రికార్డును ప్రధాని మోదీ బద్దలు కొట్టారు. జూన్ 9 నాటికి ఆయన పదవిలో విజయవంతంగా 4,398 రోజులను పూర్తి చేసుకుని సరికొత్త చరిత్ర సృష్టించారు. అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు పూర్తయిన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం (జూన్ 09) సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. "మా ప్రభుత్వపు గత 12 సంవత్సరాల పాలన కేవలం అధికార పీఠం కోసం కాదు.. అది దేశ ప్రజల విశ్వాసం, సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి అంకితమైంది. 140 కోట్ల దేశ ప్రజల అండదండలు, ఆశీస్సులతో, 'దేశమే ప్రథమం' అనే ఏకైక స్ఫూర్తితో మా ప్రయాణం సాగింది. దేశ ప్రగతికి చోదక శక్తులైన యువత, మహిళలు, శ్రామికులు, మన రైతు సోదర సోదరీమణులకు సాధికారత కల్పించడంలో మేము అన్ని విధాలా కృషి చేశాము" అని ప్రధాని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పన నుండి డిజిటల్ విప్లవం వరకు భారతదేశం సాధించిన అద్భుత విజయాలను ఆయన ప్రస్తావించారు. "మన అవిశ్రాంత కృషి ఫలితంగానే నేడు దేశం ప్రపంచవ్యాప్తంగా ఒక సరికొత్త గుర్తింపును, గౌరవాన్ని పొందింది. 2047 నాటికి 'వికసిత్ భారత్' అనే మహోన్నత సంకల్పాన్ని సాకారం చేసుకునేందుకు సేవ, సుపరిపాలన, శ్రేయస్సు అనే ఈ మార్గంలో మనం మరింత వేగంగా ముందుకు సాగుతూనే ఉంటాం" అని ప్రధాని మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. 2014 మే 26న తొలిసారి దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీ, 2019లో రెండోసారి మరింత భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొంది, 2024 జూన్ 9న ఆయన వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నెహ్రూ రికార్డు వైపు అడుగులు వేశారు. నేటితో సరిగ్గా జూన్ 9 మంగళవారం ఆయన మూడో విడత పాలనలోకి అడుగుపెట్టి సరిగ్గా రెండేళ్లు పూర్తయ్యాయి. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, అత్యధిక కాలం పాటు దేశాన్ని నిరంతరాయంగా నడిపించిన ఏకైక నాయకుడిగా నిలిచారు. గడిచిన 12 ఏళ్ల మోదీ హయాంలో భారతదేశం ఆర్థికంగా, సాంకేతికంగా ఎంతో బలోపేతమైంది. యూపీఐ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లతో ప్రపంచానికి సరికొత్త పాఠాలు నేర్పింది. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో వెనుకబడి ఉన్న భారత్, నేడు గ్లోబల్ లీడర్‌గా ఎదిగింది. అంతర్జాతీయ వేదికలపై భారతదేశం తీసుకునే నిర్ణయాలు నేడు ప్రపంచ గమనాన్ని శాసిస్తున్నాయి. ప్రధాని మోదీ సాధించిన ఈ చారిత్రక మైలురాయిపై దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## టెర్రర్ నెట్‌వర్క్‌పై ఎన్ఐఏ నజర్




పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాది షహజాద్ భట్టికి సంబంధించిన మూడు ఉగ్రవాద గ్యాంగ్‌స్టర్ నెట్‌వర్క్ కేసులకు సంబంధించి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) మంగళవారం పంజాబ్, హరియాణాలలో 18 చోట్ల సోదాలు నిర్వహించింది. సంబంధిత సమాచారాన్ని సేకరించేందుకు పలువురిని విచారించింది. ఈ మూడు కేసుల్లో ఎన్ఐఏ నిఘాలో ఉన్న వ్యక్తుల కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, ఆర్థిక లావాదేవీలు, కార్యకలాపాలకు సంబంధించిన సమాచారంతో పాటు, పలు డిజిటల్ డివైజ్‌లు, పత్రాలను కూడా స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు ఎన్ఐఏ ప్రకటన విడుదల చేసింది.

### ఎన్ఐఏ ప్రకటనలో ఏముందంటే?

హరియాణా, పంజాబ్‌లోని తొమ్మిది జిల్లాల్లోని 18 ప్రాంతాల్లో తమ బృందాలు సోదాలు చేపట్టాయని ఎన్ఐఏ తెలిపింది. సరిహద్దుల అవతల జరుగుతున్న భారీ కుట్రను ఛేదించేందుకు సోదాల సమయంలో సేకరించిన సమాచారం, సాక్ష్యాలను ఫోరెన్సిక్, సాంకేతిక పరీక్షల కోసం పంపినట్లు పేర్కొంది. గ్యాంగ్‌స్టర్ నుంచి ఉగ్రవాదిగా మారిన షహజాద్ భట్టి నడుపుతున్న నెట్‌వర్క్ వెనుక ఉన్న భారీ కుట్రను ఛేదించే లక్ష్యంతో సాగుతున్న దర్యాప్తులో భాగంగా, తదుపరి విచారణ కోసం కొందరు వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు స్పష్టం చేసింది. భట్టి సహచరులను, ఈ మూడు కేసులకు సంబంధించి ఉగ్ర కుట్రతో సంబంధం ఉన్న ఇతరులను గుర్తించేందుకు ఈ సోదాలు జరిపామని వివరించింది.

## అయోధ్య రామమందిరానికి రూ.500 కోట్లకు పైగా విరాళాలు

అయోధ్య రామమందిరాన్ని సందర్శించే భక్తుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతుండటంతో విరాళాలు కూడా భారీగా అందుతున్నాయి. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగినప్పటి నుంచి సుమారు 15 కోట్లకు పైగా ప్రజలు ఆలయాన్ని సందర్శించినట్లు ట్రస్ట్ వెల్లడించింది. ఫలితంగా రూ.500 కోట్లకు పైగా విరాళాలు అందాయని వివరించింది. వీటిని పారదర్శకంగా సురక్షితంగా భద్రపరుస్తున్నట్లు తెలిపింది. గణాంకాల ప్రకారం ఒక్కో భక్తుడి నుంచి సగటున రూ.33 కంటే ఎక్కువ విరాళం లభిస్తోందని వివరించింది. రామమందిరంలో విరాళాల ప్రక్రియను సులభతరం చేయడానికి ఆరు పెద్ద హుండీలను ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్? అధికారులు తెలిపారు. వీటికి అదనంగా మందిర ప్రాంగణంలోని ఇతర ఆలయాల వద్ద మరో 12 విరాళాల హుండీలను ఉంచినట్లు చెప్పారు. భక్తులు తమ ఇష్టానుసారం నగదు రూపంలో విరాళాలు ఇచ్చి, వెంటనే కంప్యూటరైజ్డ్ రసీదును పొందేందుకు వీలుగా నాలుగు కౌంటర్లను కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ విధానం భక్తులు సులభంగా విరాళాలు ఇవ్వడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి పైసాకు కచ్చితమైన లెక్కలు ఉన్నాయని, ఎటువంటి అక్రమాలు జరగలేదని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ సహా ఇతర అధికారులు నిరంతరం స్పష్టం చేస్తున్నారు. రామమందిరానికి ప్రస్తుతం రోజుకు సగటున రూ.8 నుంచి రూ. 10 లక్షల వరకు విరాళాలు అందుతున్నాయి. ఈ మొత్తం ప్రధానంగా విరాళాల హుండీలు, కౌంటర్ల ద్వారానే వస్తున్నాయి. రామ్ లల్లాను దర్శించుకునేటప్పుడు భక్తులు నేరుగా విరాళాల పెట్టెల్లో డబ్బు వేస్తుంటారు. అదే కౌంటర్ల వద్ద విరాళాలు ఇచ్చేటప్పుడు రసీదు తీసుకునే విధానం ఉంటుంది. పారదర్శకత కోసం విరాళాల ప్రక్రియ అంతా జజుఎ నిఘాలోనే జరుగుతుంది. డబ్బును లెక్కించే ప్రదేశంలో వాయిస్ రికార్డింగ్ సదుపాయంతో కూడిన ఆధునిక జజుఎ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. డబ్బును లెక్కించడానికి ఒక ప్రత్యేక ఏజెన్సీని నియమించారు. ఆరుగురు సిబ్బంది రెండు షిఫ్టుల్లో ఈ లెక్కింపు ప్రక్రియను నిర్వహిస్తారు. వీరికి అదనంగా ట్రస్ట్ నియమించిన అధికారులు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు కూడా ఈ ప్రక్రియలో సహాయపడతారు. భక్తులు అందించిన విరాళాలను లెక్కించిన తర్వాత ఆ నిధులను 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' ఖాతాలో జమ చేస్తారు. నిర్ణీత పరిమితులకు అనుగుణంగా డబ్బును బ్యాంక్ ఖాతాలో జమ చేసి మిగిలిన నిధులను ఒక సంచిలో సీల్ చేసి సురక్షితమైన గదిలో భద్రపరుస్తారు. ఆన్‌లైన్ మాధ్యమాలు, చెక్కులు, ఖూ× లేదా విరాళాల పెట్టెల ద్వారా ట్రస్ట్‌కు అందిన నిధులపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆడిట్ నిర్వహిస్తారు. ఇందుకోసం చార్టర్డ్ అకౌంటెంట్లను నియమించారు. అలాగే ఈ ప్రక్రియలో అంతర్గత బ్యాంక్ సిబ్బంది, అధికారులు కూడా పాల్గొంటారు. ఈ ఆడిట్‌లో ఆదాయం, వ్యయంతో సహా ప్రతి రూపాయికి సంబంధించిన వివరమైన లెక్కల పరిశీలన ఉంటుంది. ఈ ఆర్థిక వివరాలు ట్రస్ట్‌కు సమర్పించిన తర్వాత సమావేశాల సమయంలో దాని నిర్వాహక సభ్యులు పరిశీలిస్తారు. రామ్ లల్లా 'ప్రాణ ప్రతిష్ఠ' జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 15 కోట్లకు పైగా ప్రజలు దర్శించుకున్నారు. ట్రస్ట్‌కు మొత్తం రూ. 500 కోట్లకు పైగా విరాళాలు అందాయి. ఇందులో సుమారు రూ. 150 కోట్లు విరాళాల హుండీల ద్వారా రాగా మిగిలిన రూ. 350 కోట్లు ఆన్‌లైన్ మాధ్యమాలు, కౌంటర్ల ద్వారా సమకూరాయి. ఈ నిధులను ఆలయ నిర్వహణ, సేవా కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రాజెక్టుల కోసం వినియోగిస్తామని ట్రస్ట్ పేర్కొంది. కాగా, అయోధ్యలోని భారీ రామమందిర 'ప్రాణ ప్రతిష్ఠ' 2024 జనవరి 22న జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

# రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించాం

ధాన్యం సేకరణలో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించామన్న పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రూ.35,077 వేల కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. 65.91 లక్షల ఎకరాల్లో 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందని, 52 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని కేంద్రం చెప్పిందని అన్నారు. 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు.




**53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు**

దేశంలో పండే వరిలో 61 శాతం తెలంగాణలోనే ఉందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. పక్కరాష్ట్రం 25 లక్షల మెట్రిక్ టన్నుల వరి మాత్రమే కొనుగోలు చేసిందని, యాసంగి పంటలో పక్క రాష్ట్రాలు తమ కన్నా తక్కువ కొన్నాయన్నారు. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నామన్నారు. మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయించామని, రూ.171 కోట్లు మహిళా సంఘాలకు ఇచ్చామని వెల్లడించారు. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని వివరించారు.

**ఉన్న ప్రతి వరి గింజను కొనుగోలు చేశాం**

20.86 కోట్ల గోనె సంచుల్లో 18 కోట్లు మాత్రమే ఉపయోగించామన్న మంత్రి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుటి నుంచి ఈ యాసంగి పంటలోనే ఎక్కువగా ధాన్యం సేకరించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తమ కన్నా తక్కువ ధాన్యం సేకరించిందని, బీజేపీ పాలిత రాష్ట్రంలో కూడా ఇంత వరి సేకరణ చేయలేదన్నారు. పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రూ.1.35 లక్షల కోట్లు ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో రైతులకు రూ.లక్ష కోట్లు ఇచ్చిందని తెలిపారు. వరి సేకరణలో కేంద్రం ఇచ్చిన టార్గెట్ కంటే బీఆర్ఎస్ ప్రభుత్వం తక్కువ కొనుగోలు చేసిందని పేర్కొన్నారు.

కేంద్రం ఇచ్చిన టార్గెట్ కంటే ఎక్కువగానే వరి సేకరించామని, రైతుల వద్ద ఉన్న ప్రతి వరి గింజను కొనుగోలు చేశామని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి కొనుగోలు చేసే వరిని కేంద్రం ఏటా తగ్గిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో వరి ఉత్పత్రి పెంచుతుంటే కేంద్ర మాత్రం కొనుగోలు చేయడం లేదని, కేంద్రం కోటా తగ్గించినా ఎంఎస్పీ ప్రకారం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. "దేశంలో పండే వరిలో 61 శాతం తెలంగాణలోనే ఉంది. పక్క రాష్ట్రం 25 లక్షల మెట్రిక్ టన్నుల వరి మాత్రమే కొనుగోలు చేసింది. యాసంగి పంటలో పక్క రాష్ట్రాలు, తెలంగాణ కన్నా తక్కువే కొన్నాయి. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నాం. మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయించాం. రూ.171 కోట్లు మహిళా సంఘాలకు ఇచ్చాం. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం"

# నార్త్ జనానికి దూరమౌతున్న కాంగ్రెస్

-మొదటిపేజీ తరువాయి

ఇలాంటి ప్రాంతీయ సెంటిమెంట్‌ను, ముఖ్యంగా ఉత్తరాది వర్సెస్ దక్షిణాది వాదాన్ని లేవనెత్తడం వెనుక కాంగ్రెస్ పార్టీ మారుతున్న అంతర్గత రాజకీయ సమీకరణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత కొన్ని ఎన్నికల సరళిని పరిశీలిస్తే, ఉత్తరాది రాష్ట్రాలలో కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో పుంజుకోలేకపోతోంది. అదే సమయంలో కర్ణాటక, తెలంగాణ వంటి దక్షిణాది రాష్ట్రాలు కాంగ్రెస్‌కు ప్రధాన ఆర్థిక, రాజకీయ వనరులుగా మారాయి. ఉత్తరాదిపై ఆశలు వదులుకోకపోయినా, తమకు పెట్టని కోటగా మారిన దక్షిణాదిని మరింత పటిష్టం చేసుకోవాలనే వ్యూహంలో భాగంగానే రేవంత్ రెడ్డి చేత కాంగ్రెస్ అధిష్ఠానం ఈ తరహా వాయిస్ వినిపిస్తోందని భావించవచ్చు. ఈ మొత్తం వ్యవహారంలో రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణ ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా, దక్షిణాదిలో కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన పిల్లర్ గా రూపాంతరం చెందుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజన కేవలం జనాభా ప్రాతిపదికన జరిగితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసినందుకు దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ ప్రాధాన్యతను కోల్పోతాయని రేవంత్ రెడ్డి గణాంకాలతో సహా హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఆయన తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వంటి ఇతర దక్షిణాది నేతలకు లేఖలు రాస్తూ అందరినీ ఏకం చేసే ప్రయత్నం చేయడం ద్వారా ప్రాంతీయ పార్టీల కంటే తానే ఈ వాదాన్ని బలంగా మోయగలనని నిరూపించుకుంటున్నారు. రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ మోడల్' అంటే 50% సీట్లను జనాభా ప్రాతిపదికన, మిగిలిన 50% సీట్లను ఆయా రాష్ట్రాల ఆర్థిక సహకారం ఆధారంగా కేటాయించాలనే డిమాండ్ ? ఆయన పొలిటికల్ మెచ్యూరిటీని చూపిస్తోంది. దీనివల్ల ఆయన కేవలం గుడ్డిగా కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం లేదని, ఒక నిర్మాణాత్మకమైన ప్రత్యామ్నాయాన్ని చూపిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది అటు జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ ఇమేజ్‌ను దెబ్బతీయకుండా, ఇటు దక్షిణాది ప్రయోజనాలను కాపాడే సమతుల్య వ్యూహంగా ఉపయోగపడుతోంది. భవిష్యత్ రాజకీయాల కోణంలో చూస్తే, ఈ 'దక్షిణాది సెంటిమెంట్' రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. ఢిల్లీ



పాలకుల నిర్ణయాల వల్ల దక్షిణాది రాజకీయంగా అణగారిపోతుందనే భయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ప్రాంతీయ సెంటిమెంట్‌ను ఓట్లుగా మార్చుకునే ప్రయత్నం కాంగ్రెస్ చేయవచ్చు. అయితే, ఒక జాతీయ పార్టీగా కాంగ్రెస్‌కు ఈ వ్యూహం రెండు అంచుల కత్తి లాంటిదే. దక్షిణాదిలో ఈ వాదం మైలేజ్ ఇచ్చినప్పటికీ, ఉత్తరాది రాష్ట్రాలలో దీనివల్ల కాంగ్రెస్ మరింత రక్షణలో పడే ప్రమాదం ఉంది. అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో దక్షిణాది హక్కుల కోసం పోరాడే ఒక 'ఫైర్ బ్రాండ్' లీడర్‌గా రేవంత్ రెడ్డి జాతీయ స్థాయిలో తన స్థానాన్ని పటిష్టం చేసుకుంటున్నారు.

మంత్రి పదవి ఇవ్వాలంటూ వినతులు

తెలంగాణకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు.. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీంతో భేటీ అయ్యారు. వీరిలో ప్రముఖంగా మునుగోడు ఎమ్మెల్యే, ఫైర్ బ్రాండ్ నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని ఆయన సుదీర్ఘ లేఖను రాహుల్‌గాంధీకి అప్పగించారు. తాను పార్టీకి ఎంత విధేయుడినో ఆయన వివరించారు. 15 పేజీల లేఖలో పలు వివరాలను ఆయన వెల్లడించినట్టు తెలిసింది త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ ఉంటుందన్న చర్చల నేపథ్యంలో కోమటిరెడ్డి సహా.. సీనియర్ నాయకు లు రాహుల్‌తోభేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఒకసారి మంత్రివర్గాన్ని విస్తరించారు. అప్పట్లో అడ్లూరి లక్ష్మణ్ సహా.. మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు అవకాశం కల్పించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముందు ఈ కూర్పు జరిగింది. అయితే.. ఇప్పుడు మరోసారి విస్తరించాలని చూస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఎప్పటి నుంచో మంత్రి పీఠంపై ఆశలు పెట్టుకున్న కోమటిరెడ్డి మంత్రి పీఠం కోసం విస్తృ తంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రివర్గంలో సీటును ఆయన అత్యంత ప్రతిష్టాత్మకంగా కూడా భావి స్తున్నారు. గత ఆరు మాసాల నుంచి తన వ్యాఖ్యల ద్వారా మరింత వేడి పుట్టిస్తున్నారు. తనకు మంత్రి వర్గంలో ఎందుకు చోటివ్వరంటూ కోమటిరెడ్డి ప్రశ్నించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక, రాష్ట్ర నేతలతో పనికాదనుకున్న ఆయన.. నేరుగా ఢిల్లీ పెద్దలకే విన్నవించారు.

# ఖమ్మంలో దారుణం
# 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడి

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 12 ఏళ్ల బాలికపై ఓ నరరూప రాక్షసుడు దారుణానికి ఒడిగట్టాడు. చిన్నారిపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడి, ఆ తర్వాత భవనం నాలుగో అంతస్తు పైనుంచి తోసేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఖమ్మం 2వ పట్టణ పోలీసుల వివరాల ప్రకారం అదే పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద వృద్ధ దంపతులు కాపలా(వాచ్‌మెన్) పని చేస్తున్నారు. నెల రోజుల కిందట వారి 12 ఏళ్ల మనమరాలు వేసవి సెలవుల్లో ఇక్కడికి వచ్చింది. ఈ నెల 6వ తేదిన రాత్రి సమయంలో అపార్టుమెంటు పక్కన పడి ఉండటాన్ని ఆ దంపతులు గమనించారు. తీవ్రగాయాలతో స్పృహ లేకుండా ఉన్న బాలికను వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. ఆ చిన్నారీ 8వ తేదీ సాయంత్రం స్పృహలోకి రాగానే అసలేం జరిగిందని తల్లిదండ్రులు అడగగా నిజం బయటపడింది. అదే అపార్టుమెంటులో ఓ వ్యక్తి తనపై లైంగిక దాడి చేశాడని నాలుగో అంతస్తు పైనుంచి కిందకు విసిరేశాడని చెప్పినట్లు ఏసీపీ రమణమూర్తి తెలిపారు.

**తీవ్ర గాయాలు**

ఈ నెల 6న వారి 12 ఏళ్ల కుమార్తెపై అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఓ దుర్బుద్ధి కలిగిన వ్యక్తి లైంగిక దాడి చేశాడు. దీంతో భయపడిన బాలిక కేకలు వేసింది. ఆ చిన్నారిని నిందితుడు అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తు నుంచి కిందకు తోసేశాడు. దీంతో ఆ చిన్నారి కిందపడిపోయింది. వెన్నెముక, చేతులు, కాళ్లు, పక్కటెముకలకు తీవ్ర గాయాలయ్యాయి.




విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆ బాలికను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

**ఆలస్యంగా వెలుగులోకి**

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు అదే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. అయితే ఈ నెల 6వ తేదీన బాలికపై లైంగిక దాడి జరగగా, అది ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. కేసు ప్రాథమిక దశలో ఉందని పూర్తి వివరాలు నిందితుడ్ని అరెస్టు చేసిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏసీపీ రమణమూర్తి చెప్పారు.

"నిన్న మాకు ఒక ఫిర్యాదు అందింది. 12ఏళ్ల చిన్నారిని అదే అపార్ట్?మెంట్?లో ఉండే వ్యక్తి లైంగిక దాడి చేసి బిల్డింగ్? పై నుంచి తోసేశారని చెబితే ప్రాథమికంగా కేసు నమోదు చేయడం జరిగింది. తర్వాత బాధితురాలిని మెడికల్?, మెజిస్ట్రేట్? ముందు ప్రవేశపెట్టి, భరోసాలో స్టేట్?మెంట్, మెడికల్ సాక్ష్యాల ప్రకారం కేసును ఫైనలైజ్ చేస్తాం. ఈ ఘటన జూన్ 6వ తేదీన జరిగింది. రెండ్రోజులు నుంచి ఆ బాలిక స్పృహలో లేదు. నిన్న రాత్రి స్పృహలోకి వస్తే ఆమె తల్లికి విషయం చెబితే ఆమె వెంటనే పోలీస్? స్టేషన్?కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే మేం పోక్సో సెక్షన్ల కింద కేసు నమోదు చేశాం. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉంది. బాధితురాలి వివరాలను ఎవరూ బహిరంగపరచవద్దు. అది సుప్రీంకోర్టు గైడ్?లైన్స్?కి విరుద్ధం. అలా చేసిన వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. నిందితుడిని 24 గంటల లోపు పట్టుకుంటాం. బాలిక పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది. నిందితుడు డ్రైవర్?గా పనిచేస్తున్నాడు. వయస్సు 45 వరకు ఉంటుంది. పూర్తి వివరాలు అరెస్టు తర్వాత వెల్లడిస్తాం" – రమణమూర్తి, ఖమ్మం టౌన్ ఏసీపీ

## ఇందిరమ్మ రాజ్యం వస్తేనే మహిళలకు గుర్తింపు

-మొదటిపేజీ తరువాయి

ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టిందని, భారత్‌కు స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకి దక్కుతుందని తెలిపారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించిన ఘనత కాంగ్రెస్‌దేనని గుర్తు చేశారు.

**మహిళలకు రిజర్వేషన్ల బిల్లు**

బీజేపీ పార్టీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళలకు ఇచ్చారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకూ మంత్రి పదవి ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని చెప్పుకొచ్చారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారని, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లకు 2013లో సోనియాగాంధీ బిల్లు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు.

**ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం**

ఇందిరమ్మ రాజ్యం వస్తేనే మహిళలకు గుర్తింపు ఉంటుందని, మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును చెల్లించలేదని, మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. మహిళలతో పెట్టుకున్నందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిందని తెలిపారు. మహిళల ఉచిత ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు.

**మహిళలను కోటీశ్వరులను చేస్తాం**

ఆడబిడ్డలు ఉచితంగా బస్సులో పక్క ఊరు వెళ్లి చదువుకుంటున్నారని, ఫ్రీ బస్సు వల్ల స్కూళ్లల్లో ఆడపిల్లల డ్రాపవుట్లు తగ్గాయని తెలిపారు. అంబానీ, అదానీలకు పోటీగా పెట్రోల్ బంక్‌లు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలోనే జిల్లా మహిళా శక్తి భవనాలు నిర్మిస్తామని, హైటెక్‌సిటీ పక్కన రూ. వెయ్యి కోట్ల భూమిని మహిళా సంఘాలకు ఇచ్చామని వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతి మహిళల చేతిలో ఉందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరలను ఏనాడైనా మహిళలు కట్టుకున్నారా? అని అడిగారు. తమ ప్రభుత్వం ఇచ్చిన చీర కట్టుకుని మహిళలు ఈ సభకు వచ్చారని, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే వరకు విశ్రమించనని స్పష్టం చేశారు.

## రోడ్లు భవనాల శాఖ ఈఎన్‌సీ నివాసాల్లో ఏసీబీ సోదాలు

-మొదటిపేజీ తరువాయి

సోదాలు నిర్వహించారు. ఆర్ అండ్ బీ శాఖ ఈఎన్?సీ మోహన్? నాయక్ నివాసం, కార్యాలయం, ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో తనఖీలు చేపట్టారు. హైదరాబాద్‌లోని మియాపూర్ వసంత విహార్?లోని నివాసం, నిజామాబాద్ సహా 15 చోట్ల దాడులు చేశారు. ముఖ్యంగా ప్రభుత్వం నుంచి వచ్చే కాంట్రాక్టులను తన స్నేహితులు, బంధువులకే ఇచ్చారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు.

**మొత్తం ఆస్తుల విలువ వందల కోట్లు**

మోహన్ నాయక్ నివాసంలో ఇప్పటి వరకు రూ.65 లక్షల నగదు, 10 గ్రాముల చొప్పున బరువున్న 15 బంగారు బిస్కెట్లు, బంగారం, వెండి లభించాయి. వీటితో పాటు హైదరాబాద్, నిజామాబాద్?లలో ఖాళీ స్థలాలు, ఆస్తులకు సంబంధించిన పత్రాలను ఇప్పటి వరకు ఏసీబీ అధికారులు గుర్తించారు. మొత్తం ఆస్తుల విలువ వందల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

**నగదు, బంగారం సీజ్**

ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై మోహన్‌నాయక్ నివాసం, కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖకు చెందిన అనేక అనేక బృందాలు సోదాలు నిర్వహించాయని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్‌తోపాటు నిజామాబాద్‌లోనూ తనిఖీలు చేశామని వెల్లడించారు. నగదు, బంగారం, బంగారం బిస్కెట్‌లు సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఆస్తుల పత్రాలు కూడా గుర్తించామని తెలిపారు. "ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై మోహన్‌నాయక్ నివాసం, కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖకు చెందిన అనేక అనేక బృందాలు సోదాలు చేశాయి. హైదరాబాద్?తోపాటు నిజామాబాద్ లోనూ తనిఖీలు చేశాం. నగదు, బంగారం, బంగారం బిస్కెట్?లు సీజ్? చేశాం. ఆస్తుల పత్రాలు కూడా గుర్తించాం"

## రానున్న రోజుల్లో ఎల్‌నినో మరింత తీవ్రరూపం

**నైరుతి రుతుపవనాల్లో తగ్గనున్న వర్షపాతం**

**ఎల్‌నినో పరిస్థితులపై బులెటిన్ విడుదల చేసిన ఇన్‌కాయిస్ శాస్త్రవేత్తలు**

**తగ్గనున్న నైరుతి వర్షాలు – పర్యావరణానికి, మత్స్య పరిశ్రమకు నష్టం**

**సానుకూల ఉష్ణోగ్రతలు బలహీనపడి తటస్థ స్థితి**



గత నెలలో పసిఫిక్ మహా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో వచ్చిన మార్పుల కారణంగా ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయని, తాజాగా అవి తీవ్ర రూపం దాల్చాయని ఇన్‌కాయిస్ శాస్త్రవేత్తలు వెల్లడించారు. వచ్చే రోజుల్లో మరింత తీవ్రతరం అవుతాయని పేర్కొన్నారు. ఈ నెల నుంచి వచ్చే సంవత్సరం వరకు ఎల్‌నినో పరిస్థితులు కొనసాగుతాయని తెలిపారు.

**ఎల్‌నినో పరిస్థితులపై బులెటిన్ విడుదల**

హైదరాబాద్ నగరంలోని భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవల కేంద్రం (ఇన్‌కాయిన్) ఎల్‌నినో పరిస్థితులపై సోమవారం తాజా బులెటిన్ విడుదల చేసింది. పసిఫిక్ మహా సముద్రం తూర్పు భూమధ్య రేఖ ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా పెరిగినట్లు భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవల కేంద్రం స్పష్టం చేసింది.

**మత్స్య పరిశ్రమకు భారీ నష్టాన్ని కలిగిస్తాయి**

ఎల్‌నినో ఏర్పడిన సందర్భంలో మన దేశంలో రుతు పవనాలపై ప్రతికూల ప్రభావం ఉంటుందని ఇన్‌కాయిస్ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అత్యధిక వర్షపాతం నమోదు అయ్యే నైరుతి రుతు పవనాల్లో ఈసారి వర్షపాతం తగ్గుతుందని వెల్లడించారు. సముద్ర పర్యావరణానికి కూడా నష్టం కలుగుతుందని తెలిపారు. ఉత్తర హిందూ మహా సముద్రంలో తీవ్రమైన, దీర్ఘకాలిక సముద్ర ఉష్ణ తరంగాలు (మెరైన్ హీట్ వేవ్స్) ఏర్పడతాయని తెలిపారు. ఇవి సముద్ర పర్యావరణ సమతుల్యతను దెబ్బ తీస్తాయని, మత్స్య పరిశ్రమకు భారీ నష్టాన్ని కలిగిస్తాయని, పగడపు దిబ్బలను నాశనం చేస్తాయని వివరించారు.

**సానుకూల ఉష్ణోగ్రతలు బలహీనపడి తటస్థ స్థితి**

2024–26 మధ్య రెండు సంవత్సరాల్లో పసిఫిక్ మహా సముద్ర ఉష్ణోగ్రతలు అనేక మార్పులకు గురయ్యాయి. 2024 సంవత్సరం మే నెలలో అంతకుముందు ఉన్న సానుకూల ఉష్ణోగ్రతలు బలహీనపడి తటస్థ స్థితికి చేరుకున్నాయి. గత ఏడాది మే నుంచి నవంబర్ నెల మధ్య పశ్చిమ పసిఫిక్ ప్రాంతంలో సముద్ర అంతర్భాగంలో ఉష్ణోగ్రతలు దాదాపు 3 డిగ్రీల వరకు మారాయి. 2026 ఫిబ్రవరిలో పసిఫిక్ తూర్పు, మధ్య ప్రాంతాల్లో చల్లదనం తగ్గి, సముద్ర అంతర్భాగంలో ఉష్ణోగ్రత పెరగడం మొదలైంది. గత నెల 2026 పసిఫిక్ మహా సముద్రంలోని చల్లటి ఉష్ణోగ్రతలు పూర్తిగా మాయమై, ఉపరితల, అంతర్భాగ ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల కంటే అధికంగా పెరిగాయి. ఇది మధ్య పసిఫిక్ ప్రాంతంలో పూర్తి స్థాయిలో ఎల్‌నినో దశ ప్రారంభమైందని సూచిస్తోంది.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి..నలుగురు అరెస్ట్

**మిగతావారు పోలీసులను చూసి పరార్..**

**రూ.7040 నగదు,నాలుగు సెల్ ఫోన్లు,ఒక ఆటో సీజ్..**

**అక్రమార్కులకు గుండెల్లో దడపుట్టిస్తున్న ఎస్ఐ ఉదయ్ కిరణ్**

**అక్రమార్కుల గుండెల్లో మరో గబ్బర్ సింగ్**



**జన్నారం,జూన్09(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామ శివారులో గల ఒక మామిడి తోటలో కొంతమంది పేకాట ఆడుతున్నారన్నా పక్కా సమాచారంతో సోమవారం రాత్రి స్థానిక ఎస్సై ఉదయ్ కిరణ్ తమ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు.సంఘటన స్థలంలో కిష్టాపూర్ గ్రామానికి చెందిన వాసాల రవి,గోనె మురళి,కోల రాజేష్,భుక్యరాజు,లను అదుపులోకి తీసుకొని అరెస్టు చేయగా సూరమళ్ళ ప్రకాష్, పోతుగంటి వెంకటేష్,చింతల రాజ్ కుమార్,గంధం విజయ్ రావు అనే నలుగురు పోలీసులను చూసి అక్కడి నుండి పరారయినట్లు తెలిపారు.నిందితుల వద్ద నుండి రూ.7040 నగదు, నాలుగు సెల్ ఫోన్లతో పాటు,ఒక ఆటోను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. పరారైన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టి త్వరలో వారిని పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.ఏది ఏమైనా జన్నారం ఎస్ఐగా ఉదయ్ కిరణ్ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి అన్న వాస్తవాలు వినిపిస్తున్నాయి.రాజకీయ నాయకుల రెకమండేషన్, అక్రమ ఫైనాన్స్, గంజాయి,బహిరంగ మద్యపాన, త్రిబుల్ రైడింగ్ లాంటి అక్రమాలకు ఉదయ్ కిరణ్ మరో గబ్బర్ సింగ్ ల చర్యలు చేపట్టడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తొలి వర్షాల నేపథ్యంలో తాగునీటి నాణ్యత పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి..

**క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి..**

**ఆదేశించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**




**రాజేంద్రనగర్,జూన్09(సూర్యరేఖ)** నైరుతి రుతుపవనాల ఆగమనంతో నగరంలో వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో తాగునీటి నాణ్యతను పరిరక్షించేందుకు జలమండలి అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు.వర్షాకాలంలో తాగు నీరు కలుషితం అవకాశం ఉండటంతో పంపిణీ వ్యవస్థలో అన్ని స్థాయిలలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.తొలి వర్షాల సమయంలో స్లూయిస్ వాల్వ్ ఛాంబర్లలో వర్షపు నీరు చేరే అవకాశం ఉన్నందున నీటి సరఫరా ప్రారంభించే ముందు తప్పనిసరిగా స్కవర్ వాల్వ్‌లను నిర్వహించి లైన్లను శుభ్రపరచాలని ఎండీ ఆదేశించారు.జలమండలి పరిధిలోని అన్ని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు,రిజర్వాయర్లు, పంపిణీ నెట్‌వర్క్ శాంప్లింగ్ పాయింట్ల వద్ద నీటి నాణ్యత పరీక్షలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు.అలాగే క్లోరిన్ పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించడంతో పాటు రా వాటర్..శుద్ధి చేసిన నీటిలో టర్బిడిటీ స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వినియోగదారుల వద్ద కనీసం 0.2 పిపిఎం ఉండేలా చర్యలు తీసుకోవాలని,కలుషిత నీరు సరఫరా అవకాశం ఉన్న ప్రాంతాల్లో క్లోరినేషన్ మోతాదును అవసరానికి అనుగుణంగా పెంచాలని తెలిపారు.క్లోరినేషన్ పరికరాలు సక్రమంగా పనిచేసేలా చూడటంతో పాటు బ్లీచింగ్ పౌడర్,క్లోరిన్ నిల్వలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.కాలువలు,నాలాలు,నీరు నిలిచే ప్రాంతాల సమీపంలో ఉన్న పైప్‌లైన్‌లను ప్రత్యేకంగా తనిఖీ చేయాలని,లీకేజీలు,దెబ్బతిన్న పైపులు,లోపభూయిష్ట వాల్వ్‌లను వెంటనే మరమ్మతు చేయాలని సూచించారు.ఎయిర్ వాల్వ్‌లు,స్కవర్ వాల్వ్‌లు,ఛాంబర్లలో వర్షపు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.రిజర్వాయర్లు,సర్వీస్ ట్యాంకుల మూతలు,వెంటిలేటర్లు,మ్యాన్‌హోల్‌లను పూర్తిగా సీలింగ్ చేసి వర్షపు నీరు,కీటకాలు,ఇతర కాలుష్య కారకాలు లోనికి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని ఎండీ సూచించారు.లో ప్రెషర్ ఉన్న ప్రాంతాలను గుర్తించి పొల్యూషన్ జరగకుండా పంపిణీ వ్యవస్థలో ఎల్లప్పుడూ తగిన ఒత్తిడిని కొనసాగించాలని ఆదేశించారు.నీరు నిలిచే కీలక ప్రాంతాల్లో ప్రత్యేక ఫీల్డ్ బృందాలను మోహరించాలని,ముంపు ప్రాంతాల గుండా వెళ్లే పైప్‌లైన్‌లను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.సివరేజ్ పనుల్లో సమన్వయంగా పనిచేస్తూ నీటి పైప్‌లైన్‌లు,సీవరేజ్ లైన్లు సమాంతరంగా ఉన్న ప్రాంతాలను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని,సీవరేజ్ ఓవర్‌ఫ్లోలు,లీకేజీలను అత్యవసర ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ మురుగునీరు తాగునీటి వ్యవస్థలోకి ప్రవేశించకుండా చూడాలని పేర్కొన్నారు.కలుషిత నీరు సరఫరా ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైతే ప్రజలు నీటిని మరిగించి వినియోగించేలా అవగాహన కల్పించాలని సూచించారు.పైప్‌లైన్ ధ్వంసం అయినా,పొల్యూషన్ ఘటనలు ఎదురైనప్పుడు స్పందించేందుకు ఏఎంఎస్ బృందాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని,అవసరమైతే ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.వర్షాల ప్రభావం వల్ల నీటి నాణ్యత,లీకేజీలు,ప్రజా ఫిర్యాదులపై ప్రతిరోజూ సమీక్ష నిర్వహించి సంబంధిత నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించాలని ఎండీ తెలిపారు.అలాగే అధికారులు,సిబ్బంది చివరి స్థాయి క్షేత్ర సిబ్బంది వరకు ఈ సూచనలను కచ్చితంగా అమలు చేయాలని,అదే విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు,కాలనీ సంక్షేమ సంఘాలు,సమాజంలోని వివిధ వర్గాలతో సమన్వయం చేసుకుంటూ ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అశోక్ రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

**హనుమాన్ బస్తీలో ప్రజాపాలన వార్డుసభ**






**బెల్లంపల్లి,జూన్09(సూర్యరేఖ)** బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు హనుమాన్ బస్తీ 33వ వార్డులో కౌన్సిలర్ పోలు ఉమాదేవి శ్రీనివాస్ అధ్యక్షతన ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక--2రెండో విడత వార్డు సభ నిర్వహించారు.ఈ సందర్భంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం, అర్హులైన వారికి పెన్షన్లు,రేషన్ కార్డులు అందించడం, మంచినీటి సమస్యల పరిష్కారం,విద్యుత్ సరఫరా మెరుగుదల,సీసీ రోడ్లు,మురికి కాలువల నిర్మాణం, అవసరమైన ప్రాంతాల్లో బోర్లు ఏర్పాటు వంటి అభివృద్ధి అంశాలపై చర్చించారు.యువత గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ,ఏఎన్ఎం సిబ్బంది ఆరోగ్యంపై అవగాహన కల్పించి,బీపీ,షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. చిన్నారులు,గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం, అవసరమైన టీకాలపై సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ,వార్డు పోలీసు అధికారి,అంగన్‌వాడీ టీచర్లు,ఏఎన్ఎంలు,వార్డు ప్రజలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు

## నేడు మరిపెడ గడిలో 13వ వార్డు సభ..

**వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలి..**

**ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి..**



**మరిపెడ,జూన్09(సూర్యరేఖ) :** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జూన్10వ తేదీ ఉదయం 09గంటలకు మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులోని మరిపెడ జూనియర్ కాలేజ్ (గడి)లో 13వ వార్డు సభ నిర్వహించనున్నట్లు,వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వార్డు కౌన్సిలర్ గంట్ల సుజాత మహిపాల్ రెడ్డి మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 13వ వార్డు ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రత్యేక వార్డు సభను నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ వార్డు సభకు సంబంధిత శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు హాజరుకా నున్నట్లు తెలిపారు.ఈ సభలో వార్డు ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు.వార్డు పరిధిలోని ప్రజలు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను వినిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.సభలో ముఖ్యంగా వీధి దీపాల సమస్యలు,సీసీరోడ్లు,డ్రైనేజీ సమస్యలు,ఇందిరమ్మ ఇళ్లు,వృద్ధాప్య, వితంతు,వికలాంగుల పెన్షన్లు తదితర అంశాలపై వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు.ప్రజలు తమ వార్డుకు సంబంధించిన సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన పొందాలని కౌన్సిలర్ గంట్ల సుజాత మహిపాల్ రెడ్డి సూచించారు.

## కాంగ్రెస్ బలోపేతంపై ప్రత్యేక దృష్టి..

**బూత్ కమిటీల బలోపేతాన్ని ఉధృతం చేస్తాం..**

**సోమ శ్రీనివాస్ గుప్తా**



**రాజేంద్రనగర్,జూన్09(సూర్యరేఖ)** కాంగ్రెస్ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని,బూత్ కమిటీల బలోపేతాన్ని ఉధృతం చేస్తామని బాబుల్ రెడ్డినగర్‌లో మాజీ వార్డ్ మెంబర్,కాంగ్రెస్ నాయకుడు సోమ శ్రీనివాస్ గుప్తా అన్నారు.కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డినగర్‌లో మాజీ వార్డ్ మెంబర్,కాంగ్రెస్ నాయకుడు సోమ శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు.సోమ శ్రీనివాస్ గుప్తా నివాసంలో జరిగిన ఈ సమావేశంలో బాబుల్ రెడ్డి నగర్‌కు సంబంధించిన మొత్తం 9బూత్ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సోమ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ...బాబుల్ రెడ్డినగర్ ప్రభుత్వ పాఠశాలలో ఐదు పోలింగ్ బూతులు,విద్యానికేతన్ విద్యాలయం లో నాలుగు పోలింగ్ బూతులు ఉన్నాయని,మొత్తం తొమ్మిది బూత్ కమిటీలను మరింత బలోపేతం చేయడమే సమావేశం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకునేందుకు బూత్ కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్,డివిజన్ అధ్యక్షుడు ధనంజయ్, టి.ప్రేమ్ గౌడ్, సరికొండ వెంకటేష్,కాశిగారి యాదగిరి,మాధవరెడ్డి, సుధాకర్ గౌడ్,కోట పవన్ కుమార్,మామిడి శెట్టి శ్రీనివాస్,బోనకుర్తి రాము,కాళిదాస్,ఉప్పర్ హనుమంతు సాగర్ , కే.శ్రీనివాసరెడ్డి, ఓంప్రకాష్, మల్లేష్, జగన్, సురేష్, వి.కృష్ణ,రవి ముదిరాజ్,కిషోర్, కిరణ్, మైముద్, సోమ సందీప్ గుప్తా,రాయుడు,ఏ.శ్రీనివాస్,దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్యారమ్స్ పోటీల్లో సత్తాచాటిన కందుల శ్రీకృష్ణ



**ఉమ్మడి ఖమ్మం జిల్లా,జూన్09(సూర్యరేఖ)** క్యారమ్స్ కోచింగ్ సెంటర్ అసోసియేషన్ అధినేత కూచిపూడి శ్రీనివాస్ మొదటి వార్షికోత్సవ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా,ఉమ్మడి నల్గొండ జిల్లా క్యారమ్ నిర్వహించారు.అందులో భాగంగా పురుషుల సింగిల్,పురుషుల డబుల్స్,సీనియర్ సిటిజన్స్ డబుల్స్ వంటి మూడు రకాలు జరుపగా అందులో పురుషుల సింగిల్స్ లో ఫస్ట్ ప్రైజ్ బీజేపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ కందుల శ్రీకృష్ణ ప్రథమ బహుమతి పొందారు.అదే విధంగా పై పురుషుల డబుల్స్ ఈవెంట్లో ప్రథమ బహుమతి కందుల శ్రీకృష్ణ,సంజయ్ గెలుపొందారు.ఈ సందర్భంగా కందుల శ్రీకృష్ణ మాట్లాడుతూ..క్యారమ్ అనేది మైండ్ గేమ్ స్కిల్ గేమ్ దీనిలో ఉద్యోగ అవకాశాలు కూడా ఎక్కువ కనుక యువత తమ ప్రతిభ చూపించాలని,అన్నీ విధాలుగా అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి,జూన్09(సూర్యరేఖ)** బెల్లంపల్లిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ స్థలాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం పరిశీలించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయాలనే ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో భాగంగా ఈ విద్యాసంస్థను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్,నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత గడువులో నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు, మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల అమలులో కలెక్టర్ కుమార్ దీపక్ నిరంతరం ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని స్థానికులు అభినందిస్తున్నారు.

# ప్రజలకు కన్నీళ్లు పెట్టిస్తున్న ఎమ్మెల్యే..







**మైలార్ దేవ్ పల్లి యూపీహెచ్ సీలో రోగులు గోస..**

**పేదలకు అందని వైద్య.. పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే**

**ఆసుపత్రిలో రోగుల అవస్థలు,బాధలు వర్ణాతీతం..**

**ప్రజాపాలనలో పడకేసిన ప్రభుత్వ ఆసుపత్రులు..**

**మండిపడ్డ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్**

**రాజేంద్రనగర్,జూన్09(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్ దేవ్ పల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు.మంగళవారం కాటేదాన్ డివిజన్ పరిధి కాటేదాన్ లో బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు.అందులో భాగంగా బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో మైలార్ దేవ్ పల్లి బస్తీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దవాఖానాను సందర్శించారు.ఈ సందర్భంగా వెంకటేష్ నాయకులతో కలిసి దవాఖానాల్లో మౌలిక వసతులు,సదుపాయాలు,చికిత్స,రోగుల స్థితిగతులు తెలుసుకున్నారు.అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ...దవాఖాన పరిసర ప్రాంతంలో పరిశుభ్రత లోపించిందని,అదేవిధంగా దవాఖానాలో విద్యుత్ సరఫరా లేక మండుటెండలో వచ్చిన వారికి సరైన వెలుతురు లేక,ఫ్యాను లేక ఉక్కపోతతో వచ్చిన రోగులతో పాటు సిబ్బందికి తీవ్ర ఇబ్బంది కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.దవాఖానకు వచ్చిన రోగులకు అసౌకర్యం లేకుండా అన్ని విధాల సౌకర్యాలు ఉండేటట్లు చూడాలని స్థానిక ఎమ్మెల్యేను,అదేవిధంగా సంబంధిత అధికారులను కోరారు.అనంతరం దవాఖానాను సందర్శించిన వెంకటేష్ నాయకులతో కలిసి ఆసుపత్రికి వచ్చిన రోగులకు మంచినీళ్లు,పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డి.రమేష్ ముదిరాజ్,నోముల రాముయాదవ్,రాఘవేందర్ యాదవ్,రాజేష్ యాదవ్,మైసిరెడ్డి, అరుణరెడ్డి, సరిత మహేష్,కొంపల్లి జగదీష్,అశోక్ కుమార్,ప్రవీణ్,వెంకటరమణ,యాదగిరి,భాస్కర్,అనిల్,నాని,చారి,రవి,రిషి,బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు వినూత్న పథకం..

**శంషాబాద్‌లో ఆర్టీసీ అద్దె బస్సును ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**






**శంషాబాద్,జూన్09(సూర్యరేఖ)** : మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని,అందులో భాగంగానే మహిళలను ఆర్థికంగా పురోగమించేలా ప్రభుత్వం అడుగులు వేస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.తెలంగాణ రాష్ట్రంలోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయానికి శ్రీకారం చుట్టిందని వ్యాఖ్యానించారు.మహిళా సంఘాలకు మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన నడిపేందుకు ప్రత్యేక రుణ సదుపాయం కల్పించి,వాటిని టీజీఆర్టీసీ పరిధిలో నడిపించేలా ప్రభుత్వం ఈ వినూత్న పథకాన్ని రూపకల్పన చేసిందని అన్నారు.ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన కేటాయించిన 400 సరికొత్త బస్సులను ప్రారంభించారు.అందులో భాగంగా శంషాబాద్‌లో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్థానిక మహిళా సంఘానికి చెందిన ఆర్టీసీ అద్దె బస్సును రిబ్బన్ కట్ చేసి,పచ్చజెండా ఊపి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ..మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా, వ్యాపారవేత్తలుగా,రవాణా రంగంలోనూ భాగస్వాములు కావాలనేదే సీఎం రేవంత్ రెడ్డి సంకల్పమన్నారు.మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించి,బస్సుల కొనుగోలుకు మద్దతు ఇవ్వడం ద్వారా వారికి శాశ్వత ఉపాధి లభిస్తుందని అన్నారు.మహిళా సాధికారతకు ఈ పథకం ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని,సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఇదే నిదర్శనమని కొనియాడారు.మహిళా సంఘాల ద్వారా బస్సులు నడపడం వల్ల అటు ఆర్టీసీలో బస్సుల కొరత తీరడంతో పాటు,ఇటు మహిళలకు నిరంతర ఆదాయం లభిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,ఆర్టీసీ అధికారులు,మహిళా సంఘాల ప్రతినిధులు,పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.బస్సులను సాధించుకున్న మహిళా సంఘాల సభ్యులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అర్హులకు ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ లక్ష్యం..

**ఎస్ఐఆర్ ను విజయవంతం చేయాలి..**

**బీజేపీ గోల్కొండ-గోషామహల్ జిల్లా ఇన్చార్జి వై.శ్రీధర్**



**రాజేంద్రనగర్,జూన్09(సూర్యరేఖ)** కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఎస్ఐఆర్ జాబితాను బిఎల్ఏ-2 ద్వారా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ గోల్కొండ-గోషామహల్ జిల్లా ఇన్చార్జి వై.శ్రీధర్ అన్నారు.రాజేంద్రనగర్ లోని శక్తి కేంద్రాల సమావేశంను మంగళవారం బిజెపి కార్యాలయంలో నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు.పోలింగ్ స్టేషన్ల వద్ద బిఎల్ఓలు-2022,2025 లిస్టులు ఓటర్లకు అందుబాటులో ఉంచుకొని కొత్త ఓటర్లను చేర్పించి చనిపోయిన ఓటర్లను తొలగించి రెండుసార్లు జాబితాలో ఉన్న ఓటర్లను తొలగించి మ్యాపింగ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.పోలింగ్ స్టేషన్ వద్ద అందుబాటులో ఉండాలని,అనర్హత కలిగిన ఓటర్ జాబితాను తొలగించేలా చూడాలని సూచించారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐదు బూతులు,ఏవీఎం హైస్కూల్లో మూడు బూతులలో అందుబాటులో ఉండి ఎస్ఐఆర్లను విజయవంతం చేయాలన్నారు.

భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో సరిచేయడానికి,అప్డేట్ చేయడానికి, నకిలీ ఓట్లను తొలగించడానికి చేపట్టిన అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రక్రియే ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ అని వివరించారు.పక్కాగా ఓటర్ల వివరాలు ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సరిచేయడం, చనిపోయిన వారి ఓట్లను తొలగించడం,చిరునామా మారిన వారి వివరాలను అప్డేట్ చేయడం,కొత్తగా అర్హులైన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐర్ ముఖ్యఉద్దేశమన్నారు.ఈ డ్రైవ్లో భాగంగా బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తారు.అర్హులైన ఏఒక్కరి ఓటు కూడా జాబితా నుండి తొలగిపోకుండా ఉండాలంటే.. ఆధార్ కార్డు,ఓటరు ఐడీ,జనన ధృవీకరణ పత్రం లేదా చిరునామా రుజువు పత్రాలను సిద్ధంగా ఉంచుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో జి.బాబురావు, గుడిసె యాదయ్య,పి.రవీందర్, ఈ.వేణుగోపాల్,కే.నరసింహ,ఎన్.రవీందర్,పెంటయ్య,రామరెడ్డి,జంగయ్య,శశిధర్,నందిగామ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర ధరల పెరుగుదలపై సీపీఐ పోరుబాట..

**కలెక్టర్ కార్యాలయం ముట్టడికి పిలుపు**




**బెల్లంపల్లి,జూన్09(సూర్యరేఖ)** నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)డిమాండ్ చేసింది.బుధవారం ఉదయం 11గంటలకు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు ప్రకటించారు.బెల్లంపల్లిలోని భాషెట్టి గంగారాం విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మిట్టపల్లి వెంకటస్వామి మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతులు,కార్మికులు,సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ ప్రజా ప్రయోజనాలను విస్మరిస్తోందని ఆరోపించారు. నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ...పెరుగుతున్న ధరలతో సామాన్యులు,చిరు వ్యాపారులు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు.ధరల పెరుగుదలను నిరసిస్తూ నిర్వహించే ధర్నాలో ప్రజలు, ప్రజాసంఘాలు,మేధావులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బొల్లం పూర్ణిమ,ఆడెపు రాజమౌళి, బొంతల లక్ష్మీనారాయణ,కొండు బానేష్,బొల్లం తిలక్ అంబేద్కర్,కొంకుల రాజేష్,తదితరులు పాల్గొన్నారు

## అక్రమంగా తడకలు తరలిస్తున్న బుల్లేరో వాహనం పట్టివేత..





**జన్నారం,జూన్09(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందన్ పెల్లి ఆరేపల్లి వద్ద అక్రమంగా తడకలు తరలిస్తున్న బుల్లెరు వాహనాన్ని అటవీశాఖ అధికారులు సోమవారం సాయంత్రం పట్టుకొని ఇందనపెల్లి రేంజ్ కార్యాలయానికి తరలించారు.దండపెల్లి మండలంకు చెందిన ఓతడకల వ్యాపారి చింతాగూడ గోదావరి నదిగుండా నీటిలో నుండి తడకలను గోదావరి దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు.పక్క సమాచారంతో అటవీశాఖ అధికారులు చింతగూడ, ఆరేపల్లి గోదావరి నదీ ప్రాంతాలలో గట్టి నిఘా ఏర్పాటు చేసి ఆరేపల్లి వద్ద అక్రమంగా తడకలు తరలిస్తున్నా బొలెరో వాహనాన్ని పట్టుకున్నట్టు ఇందన్ పెల్లి ఆటవిశాఖ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు.తడకలను తీసుకువెళ్తున్న వ్యక్తి జగిత్యాల జిల్లాకు చెందిన వ్యాపారి అని,దానిపై పూర్తి విచారణ చేపట్టి కేసు నమోదు చేసి ఇరువురు వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.తడకలతో ఉన్న బొలెరో వాహనాన్ని సీజ్ చేసి రేంజ్ కు తరలించినట్లు తెలిపారు.

## సీఎం సభకు తరలిన సమైక్య మహిళలు..



**నిజాంపేట,జూన్9(సూర్యరేఖ)** మండల కేంద్రం నుంచి మంగళవారం మండల సమైక్య మహిళలు హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు బయలుదేరారు. మహిళా శక్తిపథకం కింద మండల సమైక్య మహిళా సంఘాల ఆధ్వర్యంలో రూ.36లక్షల వ్యయంతో ఆర్టీసీ బస్సును దుబ్బాక డిపోకు అందజేసినట్లు తెలిపారు.మహిళలకు రుణాలపై ప్రభుత్వం మంచి ఆదరణ చూపుతోందని,సీఎం సభలో రుణాలపై మరిన్ని ప్రకటనలు వెలువడనున్నాయని మహిళా సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు.నీ కార్యక్రమంలో ఏపీఎం అశోక్,సీసీలుఅమృత,రవీందర్, వెంకట్రాజ్యం,ఆపరేటర్ స్వామి,వివోఏలు,గ్రామ సమైక్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాల నేపథ్యంలో చెరువులను సిద్ధం చేయాలి..




**మున్సిపల్ అధికారులను కోరిన గణేష్ ఉత్సవ సమితి సభ్యులు నారగూడెం మల్లారెడ్డి**

**రాజేంద్రనగర్,జూన్09(సూర్యరేఖ):** వినాయక ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో ఉన్న పలు చెరువులు, కుంటలను సిద్ధం చేయాలని భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి సెంట్రల్ కమిటీ మెంబర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు.ఈ మేరకు మంగళవారం మల్లారెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రన గర్ జోనల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి పత్తి కుంట అభివృద్ధి గురించి వినతిపత్రం అందజేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ...భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరుగు గణేష్ ఉత్సవాల సందర్భంగా నిమజ్జన కార్యక్రమం కోసం పత్తికుంట, రాజేంద్రనగర్ డివిజన్ లో అభివృద్ధి చేయవలేనని కోరినట్లు తెలిపారు.ప్రతి సంవత్సరం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరుగు వినాయక చవితి,నిమజ్జన కార్యక్రమాలను పురస్కరిం చుకొని రాజేంద్రనగర్ డివిజన్ లోని పత్తికుంటలో (వినాయక చెరువు)నిమజ్జనం కొరకు చుట్టుపక్కల ప్రాంతాల నుండి రాజేంద్రనగర్,కిస్మత్పూర్,బండ్లగూడ,హైదర్ గూడ,ఉప్పర్ పల్లి,అత్తాపూర్,ప్రేమావతిపేట్,శివరాంపల్లి,కాటేదాన్,మైలార్ దేవ్ పల్లి,చాంద్రాయణగుట్ట,కార్వాన్,తాళ్లగడ్డ,లంగర్ హౌస్, మొయినాబాద్ మండలం,శంకర్ పల్లి మండలాల చుట్టుపక్కల కాలనీల నుండి సుమారు 20వేల వరకు విగ్రహాలు నిమజ్జనం చేయడం జరుగుతుందన్నారు.ఈ విగ్రహాలు పూర్తిగా నిమజ్జనం కాకుండా పైకి తేలుతూ ఉంటాయని,విగ్రహాల సంఖ్య పెరగడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.కావున పత్తికుంట చెరువులో నిమజ్జనానికి అనుకూలంగా ఉండే విధంగా150 ఫీట్ల పొడవుతో 50ఫీట్ల వెడల్పుతో 20 ఫీట్ల లోతుతో పెద్దగుంత తీయించి మూడు క్రేన్లు పట్టే విధంగా రిటనింగ్ వాలు,ప్లాట్ ఫామ్ నిర్మాణం చేసి నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని జోనల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డిని కోరినట్లు తెలిపారు.వినతి పత్రం ఇచ్చిన అనంతరం జోనల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్ఈ నరేందర్ గౌడ్,డిఈ యాదయ్య,ఏఈ నర్సింహా మూర్తి,వర్క్ ఇన్స్పెక్టర్ ఆనంద్,లతో కలిసి పత్తికుంట చెరువును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పొన్నమోని మల్లేష్ యాదవ్,డొప్ప సత్యనారాయణ ముదిరాజ్,సాబాద విజయ్ కుమార్,విక్రమ్ చారి,సాయితేజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బయోచార్ తో నేల భవిష్యత్తు భద్రం..

## ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి. రాజిరెడ్డి





**రాజేంద్రనగర్,జూన్09(సూర్యరేఖ)** పంటల వ్యర్థాలు,అవశేషాలను ఉపయోగించి పైరోలిసిస్ విధానంలో తయారు చేసే బయోచార్, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషిస్తుందని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.రాజిరెడ్డి అన్నారు.బయోచార్ వినియోగం ద్వారా పంటల దిగుబడి పెరగడమే కాకుండా,కార్బన్ నిల్వ సాధ్యమవుతుందని,ఇది క్లైమేట్-స్మార్ట్ సాగు దిశగా ఒక ముఖ్యమైన అడుగు అని ఆయన పేర్కొన్నారు. రాజేంద్రనగర్ లోని ఉద్యాన కళాశాలలో ఉన్న పూలపరిశోధన స్థానంలో బయోచార్ విధానంపై ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమానికి అయిన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.హార్టికల్చర్‌లో బయోచార్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.నేల సారాన్ని పెంపొందించడం,నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం,సూక్ష్మజీవుల క్రియాశీలతకు మద్దతు ఇవ్వడం బయోచర్ వాడకంతో ముడిపడి ఉన్నాయని,అలాగే రసాయన ఎరువులపై ఆధారాన్ని తగ్గించడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో బయోచ్చార్ వాడకం భవిష్యత్తులో ప్రధాన ఆయుధంగా ఉండనుందని తెలిపారు.రైతులు, శాస్త్రవేత్తలు,విద్యార్థులు కలిసి బయోచార్ ఆధారిత సాంకేతికతలను విస్తృతంగా వినియోగించుకోవాలని,యూనివర్సిటీ ఈదిశగా పరిశోధన,శిక్షణ,అవగాహన కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తుందని డాక్టర్ రాజిరెడ్డి తెలిపారు. తెలంగాణను క్లైమేట్-స్మార్ట్ హార్టికల్చర్ లో ముందంజలో నిలపడం యూనివర్సిటీ లక్ష్యమని, బయోచార్ వంటి ఆవిష్కరణలు రైతులకు శక్తినిస్తాయని,నేలలను సుసంపన్నం చేస్తాయని, భవిష్యత్ తరాలకు పోషక భద్రతను అందిస్తాయని రాజిరెడ్డి పునరుద్ఘాటించారు.కార్యక్రమంలో బయోచ్చార్ నిపుణులు డాక్టర్ ఆరిఫ్ ఖాన్, రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్,పూల పరిశోధనస్థానం హెడ్ డాక్టర్ జ్యోతి,కూరగాయల పరిశోధన సంస్థ అనితకుమారి,కళాశాల అసోసియేట్ డాక్టర్ ప్రశాంత్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## టీఆర్పీ నారాయణపేట జిల్లా సారథిగా ఉద్యమ వీరుడు మడివాలా కృష్ణ నియామకం..

**కార్యకర్తే మా ప్రాణం.. ప్రతి గ్రామంలో తిరుగులేని అజేయ శక్తిగా ఎదుగుతాం.!**

? గ్రామ గ్రామాన టీఆర్పీ విప్లవ కమిటీలు ఏర్పాటు చేస్తా..

– నారాయణపేట నూతన జిల్లా సారథి మడివాలా కృష్ణ



**నారాయణపేట,జూన్09(సూర్యరేఖ):** తెలంగాణ రాజ్యాధికార పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా తెలంగాణ ఉద్యమకారుడు మడివాలా కృష్ణ నియమితులయ్యారు.పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కృష్ణ బాధ్యతలు స్వీకరించారు.రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మెల్సీ,తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఇంచార్జ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేములవాడ మదన్ మోహన్ చారి చేతుల మీదుగా మడివాలా కృష్ణకు నియామక పత్రం అందజేశారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం నారాయణపేట జిల్లా నూతన సారథి మడివాలా కృష్ణ మాట్లాడుతూ..బీసీ హక్కుల సాధనకు తనపై నమ్మకంతో ఇంతటి కీలక బాధ్యతను అప్పగించిన ప్రజా నాయకుడు పార్టీ చీఫ్ తీన్మార్ మల్లన్నకు,వేములవాడ మదన్ మోహన్ చారి,రాష్ట్ర కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గల్లీ నుండి జిల్లా దాకా..గులాంగిరీకి చరమగీతం పాడుతామని,నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గం,మండలం,గ్రామంలో తిరుగులేని విధంగా కమిటీలను నిర్మించి,పార్టీని అజేయ శక్తిగా మారుస్తామని తెలియచేశారు.వెనుకబడిన వర్గాల రాజ్యాధికారం కోసం జిల్లాలో బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు.జూలై 5న భువనగిరిలో జరిగే రాజ్యాధికార సమరభేరి సభకు నారాయణపేట జిల్లా నలుమూలల నుండి ప్రజలను వేలాదిగా తరలించి సభను దిగ్విజయం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మీదింటి శివవీర్,మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షుడు మున్నూరు జైపాల్ రెడ్డి,పార్టీ కో ఆర్డినేటర్ లింగం యాదవ్,పట్టణ మైనార్టీ అధ్యక్షుడు నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## మృగశిర కార్తి సందర్భంగా కట్టఊరడమ్మకు ఘనంగా బోనాలు..

**సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించిన మున్సిపల్ చైర్‌పర్సన్ లావణనాగరాజు**




**రామాయంపేట,జూన్09 (సూర్యరేఖ)** మృగశిర కార్తి సందర్భంగా రామాయంపేట మున్సిపాలిటీ12వ వార్డు పరిధిలోని కట్టఊరడమ్మ దేవాలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి,గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్యానాగరాజు మాట్లాడుతూ...మృగశిర కార్తె రైతాంగానికి ఎంతో కీలకమైనదని,అమ్మవారి ఆశీస్సులతో పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో7వ వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజు,6వ వార్డు కౌన్సిలర్ పుట్టి సందీప్,9వ వార్డు కౌన్సిలర్ దేవుని రంజిత్, 8వ వార్డు కౌన్సిలర్ జంగంపల్లి శంకర్ గౌడ్,డీసీసీ ఉపాధ్యక్షుడు చింతల యాదగిరి,జిల్లా కార్యదర్శి పోచమ్మల గణేష్,దారం సంతోష్,యూత్ కాంగ్రెస్ నాయకుడు గౌస్,సీతారాములుగౌడ్,పోచముల ప్రసాద్,పోచమ్మ ఆంజనేయులు,తాళం బాలరాజ్, తేలు సిద్ధరాములు, గాజుల రాజు,వీరేశం,పోచముల రమేష్,చిలుక విరాట్,పోచమ్మల భాను,సుధీర్ గౌడ్, గణేష్,సాయి,తదితరులు పాల్గొన్నారు.

## బడిబాట కార్యక్రమంలో కొత్త ఎరబోయినపల్లి

**గ్రామ సర్పంచ్ పోట్రూ శ్రీనివాసరావు,మండల విద్యాశాఖ అధికారిణి పి.నివేదిత**



**ఖమ్మం,జూన్09(సూర్యరేఖ)** కల్లూరు మండలంలోని పాత ఎర్రబోయినపల్లి మరియు కొత్త ఎర్రబోయినపల్లి గ్రామాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో "బడిబాట"కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిణి పి.నివేదిత పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కొత్త ఎర్రబోయినపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నాగాంజలి,పాత ఎర్రబోయినపల్లి పాఠశాల ఉపాధ్యాయులు వి.అశోక్,జి.తిరుపతమ్మ,గ్రామ సర్పంచ్ పి.శ్రీనివాస్ రావు,మండల ఉపాధ్యాయులు కొడిసేన విజయ్ కుమార్,యర్నం అప్పారావు, యర్నం నాగరాజు,అంగన్వాడీ ఉపాధ్యాయులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నమోదు చేపట్టగా,కొత్త ఎర్రబోయినపల్లి ప్రాథమిక పాఠశాలలో 8మంది విద్యార్థులు,పాత ఎర్రబోయినపల్లి ప్రాథమిక పాఠశాలలో 8మంది విద్యార్థులు నూతనంగా ప్రవేశాలు పొందారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారిణి పి.నివేదిత మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత,గుణాత్మక విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.అలాగే గ్రామస్థుల అభ్యర్థన మేరకు పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు కొనసాగేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గ్రామ సర్పంచ్ పి.శ్రీనివాస్ రావు ప్రత్యేక చొరవచూపుతూ గ్రామంలోని బడి ఈడు కలిగిన ప్రతి విద్యార్థిని ప్రభుత్వపాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## విద్యుత్ లోడ్ కు అనుగుణంగా పెంపు.. ఎస్ఈ శ్రీరామ్మోహన్



**రాజేంద్రనగర్,జూన్09(సూర్యరేఖ)** విద్యుత్ వినియోగదారులు రోజురోజుకు విద్యుత్తును వినియోగించడంలో లోడు పెరుగుతుందని అందుకు అనుగుణంగా విద్యుత్తు సబ్ స్టేషన్ల సామర్థ్యం పెంచుతున్నామని రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ఇ శ్రీరామ్ మోహన్ తెలిపారు.మంగళవారం రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని శివరాంపల్లి సెక్షన్ పరిధిలో గల పహడి విద్యుత్ ఫీడర్ ను వేరు చేసి కొత్తగా ప్యారడైజ్ ఫీడర్ ను సుమారు రూ.50లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన లీడర్ ను ఆయన డివిజన్ డిఈపి రత్నాకర్ రావు,డిఈ (లైన్స్)చంద్రశేఖర్,డిఈ (ప్రొటెక్షన్)భాస్కర్ రావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఈ శ్రీరామ్ మోహన్ మాట్లాడుతూ...ప్రభుత్వం వినియోగదారులకు నిరంతర,నాణ్యమైన విద్యుత్ను కోట్లాది రూపాయలు వెచ్చించి తరపరా చేస్తుందని అందుకోసం వినియోగదారులు తమ బిల్లులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ప్రస్తుతమున్న పహడి విద్యుత్ ఫీడర్ 160ఏ గరిష్ట లోడ్కు చేరుకున్న11కేవీ పహాడీఫీడర్ నుండి విభజించి ప్యారడైజ్ ఫీడర్ను ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏడీఈ సత్యనారాయణ, ఏఈ నవీన్,లు పనులను చేపట్టారు.ఎంఎం పహాడీ, సులేమాన్నగర్,చింతల్మెట్,ఖయ్యుమ్నగర్లోని సుమారు 4500మంది వినియోగదారులు లబ్ధి పొందుతారు.

## జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను సందర్శించిన కల్లూరు మున్సిపల్ చైర్మన్..





**ఖమ్మం,జూన్09(సూర్యరేఖ)** కల్లూరు బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం పొదిలా పద్మతో కలిసి పాఠశాల పరిసరాలు సందర్శించారు. మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్లు విద్యార్థినిలకు మంచినీటి వసతి,పరిసరాల పరిశుభ్రత మున్సిపాలిటీ నుండి వాటర్ కనెక్షన్ ఇస్తామని, విద్యార్థులకు నాణ్యతతో కలిగిన విద్యను అందించాలని తెలిపారు.ఈ సంవత్సరం ఉత్తమ మార్కులు సాధించి త్రిబుల్ ఐటీలో సీట్లు సాధించినందుకు ఉపాధ్యాయులను విద్యార్థులను అభినందించి..రాబోయే అకాడమీక్ సంవత్సరంలో కల్లూరు బాలికల ఉన్నత పాఠశాలను రాష్ట్రస్థాయిలో పేరు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు15వ వార్డునాయకులు యాస శ్రీకాంత్,,11వార్డ్ కిష్టంశెట్టి లక్ష్మికొండల్,16వార్డ్ కౌన్సిలర్ రాంబాబు,ధరవత్ రవికుమార్ ఉపాధ్యాయిణి,లు తులసితదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ డబ్బాలతో కొల్చారం తాహసిల్దార్ ఆఫీస్ లో రైతుల నిరసన...






**కొల్చారం,జూన్09(సూర్యరేఖ)** తూకం వేసి మిల్లుకు పంపించిన ధాన్యం లారీని15 రోజులు వెయిటింగ్ లో ఉంచి తీరా అన్లోడింగ్ సమయానికి ధాన్యం రంగు మారాయని నిరాకరించడంతో ఆవేదనకు లోనైన రైతులు పెట్రోల్ డబ్బాలతో తాహసిల్దార్ కార్యాలయంలో నిరసన తెలిపిన ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది.మండలంలోని సంగాయిపేట గ్రామానికి చెందిన రైతులు గత 15రోజుల క్రితం 600 బస్తాలతో కూడిన లారీని వరిగుంతం ఎఫ్ఎంసి గోడంకు లోడ్ చేసి పంపించారు.అక్కడ15 రోజులపాటు వెయిటింగ్ లో ఉంచిన తర్వాత అన్లోడింగ్ సమయంలో బస్తాలు పరిశీలించి రంగు మారాయి అంటూ అక్కడినుండి కౌడిపల్లి మండలంలోని ముంద్రాయి సమీపంలో గల పారాబాయిలు రైస్ మిల్లుకు తరలించారు.అక్కడ మిల్లు ఓనర్ అన్లోడింగ్కు నిరాకరించడంతో రైతులు ఆవేదన చెంది తహసిల్దార్ కార్యాలయానికి వచ్చి నిరసన చేపట్టారు.తాహసిల్దార్ స్పందిస్తూ మిల్లర్ తో మాట్లాడి అన్లోడింగ్ చేపిస్తానని రైతులకు హామీ ఇచ్చారు.మండలంలో కొనుగోలు చివరి దశకు చేరుకున్నాయని,మరో నాలుగు రోజుల్లో పూర్తి కొనుగోల ప్రక్రియ పూర్తవుతుందని రైతులెవరు అధైర్యపడవద్దని తెలిపారు.దీంతో శాంతించిన రైతులు తాహసిల్దార్ కార్యాలయం నుండి వెనుతిరిగారు.

## బొటానికల్ గార్డెన్,కొండాపూర్,హైదరాబాద్ లో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం..



**శేరిలింగంపల్లి,జూన్09 (సూర్యరేఖ)** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక వేడుకల్లో భాగంగా తెలంగాణ అటవీ అభివృద్ధిసంస్థ (టీజీఫడీసీ ) ఆధ్వర్యంలోని ఎకో-టూరిజం విభాగం మంగళవారం హైదరాబాద్లోని బొటానికల్ గార్డెన్లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించింది.ఈ శిబిరాన్ని ఎకో-టూరిజం విభాగం సీనియర్ డివిజనల్ మేనేజర్ మరియు అసిస్టెంట్ డైరెక్టర్ కె.శిరీష ప్రారంభించారు. శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ వైద్య బృందం సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరం ద్వారా సంస్థ ఉద్యోగులు మరియు కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమె తెలిపారు.ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. హెడ్ ఆఫీస్,ఎకో-టూరిజం విభాగం,మరియు కొత్తగూడ రిజర్వ్ ఫారెస్ట్ కార్మికులతో కలిపి మొత్తం 100మందికి పైగా సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. చాలామంది ప్రాథమిక దశలో ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తారని,అది భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని ఆమె హెచ్చరించారు. ఈ శిబిరంలో డాక్టర్ నిఖిల్(జనరల్ ఫిజీషియన్), డాక్టర్ ప్రత్యూష(డైటీషియన్),డాక్టర్ రాజ్యలక్ష్మి (ఆయుర్వేద నిపుణులు)మరియు శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ మేనేజర్ మాలిని దేవి నేతృత్వంలోని బృందం రక్తపోటు,షుగర్,ఈసీజీ (ఈసీజీ),2డి ఎకో మరియు కంటి పరీక్షలు వంటి వివిధ రకాల ఉచిత వైద్య సేవలను అందించారు.ఈ వైద్య శిబిరంలో మొత్తం 76మంది సిబ్బంది మరియు కార్మికులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవడమే కాకుండా నిపుణుల సలహాలను పొందారు.తమ పని ప్రదేశంలోనే ఇటువంటి మెరుగైన వైద్య సేవలు అందించినందుకు లబ్ధిదారులు టీజీఎఫ్డీసీ (టీజీఫడీసీ) యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ వి. లక్ష్మారెడ్డి,డిప్యూటీ ఎఫ్.ఆర్.ఓ శ్రీనివాసురెడ్డి,ప్రాజెక్ట్ మేనేజర్ కె.సుమన్,నేచురలిస్టులు శాంసన్ రాజు, రోహిత్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. సంక్షేమం మరియు పర్యావరణ పరిరక్షణతో పాటు ఉద్యోగుల ఆరోగ్యంపట్ల తమ నిబద్ధతను ఈ శిబిరం ద్వారా సంస్థ మరోసారి చాటుకుంది.

## రోడ్ల విస్తరణతోనే ఆ ప్రాంతాలు అభివృద్ధి..

**రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**





**రాజేంద్రనగర్, జూన్09 (సూర్యరేఖ)** రవాణా సౌకర్యాలు బాగున్నప్పుడే ఆ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ జోన్ పరిధిలో జరుగుతున్న రోడ్ల విస్తరణ,నాళాల అభివృద్ధి పనులను ఆయన మంగళవారం ప్రాజెక్ట్స్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు.అజీమ్ హోటల్ నుంచి బాలాపూర్ వెళ్లే మార్గంలో గల చర్చ్ గేట్ వరకు 80ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. బండ్లగూడ నుంచి షాహీన్ నగర్ వెళ్లే మార్గంలో 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనుల పురోగతిని ఆయన పరిశీలించారు.నాలాల విస్తరణ,అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశాలు జారి చేశారు.అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.జోనల్ కమిషనర్ వెంట ఇంజనీరింగ్ విభాగం ఇంచార్జ్ ఎస్ఈ నాగేందర్ గౌడ్ , ప్రాజెక్ట్ విభాగం ఎస్ఈ మోహన్ రెడ్డి,డీఈ కాశిఫ్ హుస్సేన్,ఏఈ ఖాజ ఫైజల్ లు ఉన్నారు.

## ఎలక్షన్ కమిషన్ కార్యాలయం ఆవరణలోని డింగ్ వాటర్ లాగింగ్ ప్రాంతాన్ని

**శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్,ఉపకమిషనర్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో కలిసి తనిఖీ..**







**శేరిలింగంపల్లి,జూన్09(సూర్యరేఖ)** తనిఖీ సందర్భంగా కాజాగూడ చెరువులోకి వర్షపు నీరు సజావుగా ప్రవహించడానికి అడ్డంకి ఉన్నట్లు గుర్తించడం జరిగింది.వెంటనే చర్యలు ప్రారంభించి, హిటాచీ ఎక్స్కవేటర్ సహాయంతో ఆఅడ్డంకిని తొలగించి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరిస్తున్నాం.. దీనివల్ల పౌరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం..జోన్ పరిధిలో వర్షపు నీటి నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నాం..

## ఘనంగా శ్రీఅమ్మా భగవాన్ కళ్యాణ మహోత్సవం..



**శేరిలింగంపల్లి,జూన్09(సూర్యరేఖ)** శేరిలింగంపల్లి నియోజకవర్గం, మదీనాగూడలోని శ్రీఅమ్మాభగవాన్ సేవాలయంలో మంగళవారం శ్రీఅమ్మా భగవాన్ సేవాకమిటీ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా కన్నుల పండుగగా నిర్వహించారు.ఈ కళ్యాణ మహోత్సవ వేడుకలలో కమిటీ సభ్యులు,హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా అద్యక్షులు ఆర్యన్ డి.నాగమల్లేశ్వరరావు,సుబ్రహ్మణ్యం, కాలనీవాసులు సమీప ప్రాంతాలవాసులు,భక్తజనులు అధికసంఖ్యలో పాల్గొని శ్రీఅమ్మ భగవాన్ ఆశీస్సులు అందుకున్నారు.

# దళితుల భూములపై కన్నేస్తే ఊరుకోం..




**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**49ఎకరాల ఎస్సీ కార్పొరేషన్ భూమికి రక్షణ కవచం..**

**సర్వే పూర్తయ్యాక ఫెన్సింగ్..కబ్జాదారులపై కఠిన చర్యలు**

**మేడ్చల్,జూన్09(సూర్యరేఖ)** దళిత విద్యార్థుల భవిష్యత్తు కోసం కేటాయించిన ఒక్క గజం భూమిని కూడా కబ్జా చేసేందుకు ఎవరినీ అనుమతించబోమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్ శివారులో ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరితో కలిసి మంత్రి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 1991లో గుండ్లపోచంపల్లి శివారు సర్వేనంబర్ 509లోని49 ఎకరాల 20గుంటల భూమిని దళిత విద్యార్థుల సంక్షేమం,శిక్షణా కార్యక్రమాల కోసం ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించినట్లు తెలిపారు. తెలంగాణకు చెందిన ఎస్సీ విద్యార్థులకు ఉద్యానవన శిక్షణ అందించేందుకు ఉద్దేశించిన ఈ విలువైన భూమిని పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

**అన్యాక్రాంతాలపై కఠిన చర్యలు..**

రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీలకు చెందిన భూములను కొందరు వ్యక్తులు గత ప్రభుత్వాల అండదండలతో, ఆర్థిక బలంతో ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన మంత్రి,దళితుల హక్కులకు భంగం కలిగించే ఎలాంటి చర్యలనైనా ప్రభుత్వం సహించదని హెచ్చరించారు. “అన్యాక్రాంతం చేస్తున్న వారిలో ఎంత పెద్దవారు ఉన్నా ఉపేక్షించేది లేదు.ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని రక్షిస్తాం”అని స్పష్టం చేశారు.

**సర్వే అనంతరం ఫెన్సింగ్ ఏర్పాటు..**

49ఎకరాల20 గుంటల భూమికి సంబంధించి సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక అందిన వెంటనే పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటించారు.జిల్లా కలెక్టర్ ఈ అంశాన్ని సుమోటోగా తీసుకుని వెంటనే సర్వేపూర్తి చేసి హద్దురాళ్లు,గేట్లు ఏర్పాటు చేసి భౌతిక స్వాధీన స్థితిపై నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.

**దళితుల ఆస్తుల రక్షణలో వెనుకడుగు లేదు..**

ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధిగా బాధ్యతతోనే తాను ఇక్కడికి వచ్చానని పేర్కొన్న మంత్రి,దళితుల ఆస్తులను కాపాడటంలో ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయదన్నారు. బెదిరింపులు,ఒత్తిళ్లు,రాజకీయ ప్రభావాలకు ప్రభుత్వం భయపడదని,మాటల్లో కాదు చేతల్లో చూపిస్తామని హెచ్చరించారు.

**ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు..**

ఎస్సీ,ఎస్టీల భూముల విషయంలో ఎవరైనా చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని,అవసరమైతే ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసేందుకు కూడా ప్రభుత్వం వెనుకాడదని మంత్రి స్పష్టం చేశారు.“49 ఎకరాల 20 గుంటల్లో ఒక్క గజం భూమి పోయినా చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది” అని హెచ్చరించారు.

**రైతుల ప్రయోజనాలకూ భరోసా..**

అదే సమయంలో ఆప్రాంతంలో వ్యవసాయం చేస్తున్న రైతుల ప్రయోజనాలను కూడా పరిరక్షిస్తామని మంత్రి తెలిపారు.రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు అవసరమైన దారులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని,రైతులను ఎవరైనా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వజేష్ యాదవ్,హరివర్ధన్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులుయాదవ్,ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం,వీసీ అండ్ ఎండీ హనుమంత్ నాయక్,జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమల అధికారి బి.శ్రీధర్,జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బి.శంకర్,మేడ్చల్ ఆర్డీవో శ్యాంప్రసాద్,జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్,జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పద్మజ,మేడ్చల్ డిప్యూటీ తహసీల్దార్ అనూష,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న కౌన్సిలర్ వేణుగోపాల్ గౌడ్

**సొంత నిధులతో బోర్‌వెల్,మోటార్ ఏర్పాటు చేసి నీటి సమస్యకు పరిష్కారం..**



మేడ్చల్,జూన్09(సూర్యరేఖ) ఎల్లంపేట్ మున్సిపాలిటీ 15వ వార్డు బర్మాజీగూడలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయాలనే లక్ష్యంతో వార్డు కౌన్సిలర్ నాతి వేణుగోపాల్ గౌడ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు.తన సొంత ఖర్చులతో బోర్‌వెల్ వేయించి,బోర్ మోటార్‌ను సోమవారం ఏర్పాటు చేయించారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ,ఎలాంటి ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా స్వయంగా ముందుకు వచ్చి నీటి సమస్యను పరిష్కరించడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ...వేణుగోపాల్ గౌడ్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు.ప్రజా సేవలో ముందుండి,అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ వార్డు అభ్యున్నతికి కృషి చేస్తున్న కౌన్సిలర్‌ను గ్రామ ప్రజలు అభినందించారు.ఈ కార్యక్రమంలో సద్ది యాదిరెడ్డి, నూతనకల్ మాజీ ఎంపీటీసీ షేక్ షైన్ పాషా, లింగాపూర్ మాజీ ఉపసర్పంచ్ విగ్నేష్,మధు,శ్రీధర్, సత్యనారాయణ, బిక్షపతి, శంకరయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమావేశం విజయవంతం చేయండి..

**ఉద్యమకారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి..**



**కొల్చారం,జూన్09(సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి కే.కేశవరావు ఆధ్వర్యంలో కమిటీని నియమించడం జరిగిందిని మెదక్ జిల్లా తెలంగాణ జేఏసీ సమన్వయకర్తలు సడిమెల యాదగిరి,బి. కొండల్ రెడ్డి,లు తెలిపారు మంగళవారం గుల్షన్ క్లబ్లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...జిల్లాలో తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం కోసం రేపు సాయంత్రం ఐదు గంటలకు టీఎన్జీవో భవన్ మెదక్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడంలో తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారిని,శారీరక వికలాంగులైన వారిని,కేసులు నమోదైన వారిని,జైలు నిర్బంధించబడిన వారిని, రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడానికి ఏర్పాటు చేసుకున్న ప్రాతిపదిక కానీ తెలంగాణ మలి దశ ఉద్యమంలో ఉద్యోగులు,ఉపాధ్యాయులు,కార్మికులు సబ్బండ వర్గాల ప్రజలు పాల్గొని తెలంగాణ సాధించుకున్నారు.జిల్లాలో జరిగిన అన్ని కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొన్న వారందరిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని నేడుజరిగే సమావేశంలో మెదక్ మండలం మరియు పట్టణం హవేలీ గణపురం పాపన్నపేట కొల్చారం వెల్దుర్తి మండలాలలో పనిచేసిన ఉద్యమకారులందరూ 10 తేదీ సాయంత్రం 5గంటలకు జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్లో జరిగే సమావేశంలో పాల్గొనవలసిందిగా మెదక్ జిల్లా ఉద్యమ జేఏసీ సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది.మీడియా సమావేశంలో శంకర్ దయాల్ చారి,బొందుగుల నాగరాజు,పీడీ ఆనందం,భూపాల్ రెడ్డి,కుమార్ మామిడి,బొమ్మల మైసయ్య,ఆకుల పెంటయ్య,కంది శ్రీనివాస్ రెడ్డి,శంకర్ దయాల్ చారి,నాగరాజు, సత్యం మనోహర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## మరిపెడ పట్టణంలో డ్రైనేజీ పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి..

**పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత..**

**చెత్తను డ్రైనేజీల్లో వేయకుండా ప్రజలు సహకరించాలి..**

**మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి**




**మరిపెడ,జూన్09(సూర్యరేఖ)** మరిపెడ పట్టణంలో డ్రైనేజీ పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతిశ్రీపాల్ రెడ్డి అన్నారు.మంగళవారం ఆమె మరిపెడ పట్టణంలోని కార్గిల్ సెంటర్‌లో ఉన్న ప్రధాన డ్రైనేజీలో చేపట్టిన పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ...పట్టణ అభివృద్ధితో పాటు సంపూర్ణ పారిశుద్యానికి అధిక ప్రాధాన్యతిస్తున్నామని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక,చెత్తాచెదారాన్ని తొలగించే ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.ప్రధాన డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడం ద్వారా వర్షాకాలంలో నీటి నిల్వలు,మురుగు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.డ్రైనేజీలో పేరుకుపోయిన పూడికను తొలగించడంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా చూడడంతో పాటు ప్రజలకు మెరుగైన పారిశుధ్య వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యమన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన పనులను నిరంతరం చేపడతామని తెలిపారు.పారిశుధ్య సిబ్బంది సమర్థవంతంగా పనిచేసి డ్రైనేజీ శుభ్రతను పూర్తి చేయాలని సూచించారు.ఈ కౌన్సిలర్లు మెరుగు రాము,పానుగోతు రాములు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అలువాల ఉపేందర్ ప్రజాపతి,గంధసిరి భిక్షపతి,లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు

## ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యం.. రాగం నాగేందర్ యాదవ్




**శేరిలింగంపల్లి,జూన్09 (సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేశారు.నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపనలు జరిగాయి.అనంతరం మియాపూర్ వెజిటేబుల్ మార్కెట్ ప్రాంగణంలో మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరకపూడి గాంధీతో కలిసి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. పీఏసీ చైర్మన్,శాసనసభ్యులు అరెకపూడి గాంధీ పిలుపుమేరకు మహాసభను విజయవంతం చేసేందుకు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి డివిజన్ నుండి తరలి వెళ్లే ప్రజల కోసం భారీగా బస్సులను ఏర్పాటు చేశారు.కార్పొరేటర్ జెండా ఊపి బస్సులను ప్రారంభించి సభా ప్రాంగాణానికి తరలించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపనలు చేసిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ...శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి రూ.1978కోట్ల నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి,పీఏసీ ఛైర్మెన్, శాసనసభ్యులు అరెకపూడి గాంధీకి ధన్యవాదాలు తెలిపారు.పీఏసీ ఛైర్మెన్ పిలుపు మేరకు సభను విజయవంతం చేసిన డివిజన్ సీనియర్ నాయకులు, మహిళలు,యువకులు,కార్యకర్తలు,అభిమానులకు కార్పొరేటర్ అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తమ వంతు కృషి ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# జర్నలిస్టుల పిల్లలకు ఫీజురాయితీ ఇవ్వాలని కలెక్టర్,హైదరాబాద్ డీఈవో,లకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ విజ్ఞప్తి..





**నాంపల్లి,హైదరాబాద్,జూన్09(సూర్యరేఖ)** హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరాలలో ఫీజుల్లో 50శాతం రాయితీ కల్పించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్)హైదరాబాద్ జిల్లా కమిటీ బృందం విజ్ఞప్తి చేసింది.ఈ సందర్భంగా జిల్లా కమిటీ ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలాను కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కు సమస్యలు వివరిస్తూ..జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో బాగంగా వారి పిల్లల చదువులకు సహకరించాలని కోరారు.ప్రస్తుతం జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,దాదాపు 80శాతం మంది జర్నలిస్టులు వేతనాలు సరిగా లేక నెలవారీ ఆదాయం లేక వారి పిల్లలను చదివించుకోలేక,టుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల ఫీజులు కట్టలేక పోతున్నారని,ఈ పరిస్థితిలో జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50శాతం ఫీజు రాయితీ కల్పించాలని వారు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశామన్నారు.జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రాయితీలు అమలు చేయాలని కోరారు. రాబోయే 2026-27 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేనాటికి జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.కలెక్టర్ ను కలిసి వారిలో టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య,
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్, కోకన్వీనర్లు ఆర్.శ్రీనివాస్ గౌడ్,ఎం. రవికుమార్, పి.సంతోష్ కుమార్,అడ్వయిజర్ గోవింద్ నాయక్ తదితరులున్నారు.అనంతరం వారు హైదరాబాద్ జిల్లా విద్యాధికారి(డీఈఓ) యాదయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు.

## ఇప్పలాబోగూడ బోయకాలనీలో నీటి సమస్య పరిష్కారం..



**చెన్నూర్,జూన్08(సూర్యరేఖ)** భీమారం గ్రామ పంచాయతీ 1వ వార్డులోని ఇప్పలాబోగూడ బోయకాలనీలో వేసవికాలంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం సర్పంచ్ ఉస్కామల్ల విజయలక్ష్మి,పున్నం చందు,ల దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి కొత్త మోటార్ స్టార్టర్ ఫిట్టింగ్ పనులు చేపట్టించారు.దీంతో వార్డు ప్రజల నీటి సమస్య పరిష్కారమైంది.ఈ సందర్భంగా ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని సర్పంచ్ సూచించారు.సమస్యను వెంటనే పరిష్కరించినందుకు వార్డు ప్రజలు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లేష్, వార్డు సభ్యుడు కోమల నాగరాజు,ఉస్కామల్ల శ్రీనివాస్ తదితరులు,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థిని సన్మానించిన కలెక్టర్ ప్రతిమసింగ్..



**నిజాంపేట,జూన్09 (సూర్యరేఖ)** పది పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ చూపి 564 మార్కులు సాధించిన విద్యార్థిని లాగ్యాల ఐశ్వర్య,ను మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రతిమసింగ్ చేతుల మీదుగా సన్మానించడం జరిగింది.ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులు100కు100 శాతం ఉత్తీర్ణత సాధించడంపై ఉపాధ్యాయ బృందంతో పాటు తల్లిదండ్రులను అభినందించారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా విద్యాధికారి రాజు,మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం..



**నిజాంపేట,జూన్09(సూర్య రేఖ)** మండల కేంద్రంలో మంగళవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది.ఎండ తీవ్రతతో సతమతమవుతున్న ప్రజలకు ఈ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి తీవ్ర ఊరట లభించింది.అయితే మండలంలోని కొనుగోలు కేంద్రాల వద్ద వడ్ల తూకం కాకపోవడంతో ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు,ఈ వర్షాలతో మరికొందరు రైతులు రాబోయే వర్షాకాల పంటల కోసం తమ భూములను చదును చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

## రైతులు ఆయిల్ ఫామ్ పంటలకు మొగ్గు చూపాలి..

**జిల్లా ఉద్యానశాఖ అధికారి జే.ప్రతాప్ సింగ్**



**నిజాంపేట,జూన్09(సూర్యరేఖ)** ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రైతులు ప్రభుత్వ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి జే.ప్రతాప్ సింగ్ పిలుపునిచ్చారు.ఎలినో ప్రభావం ఉండుట చేత పంట మార్పిడి భాగంలో ఆయిల్ పామ్ తోటలు వేయాలని రైతులకు సూచించారు.ఈ మేరకు నిజాంపేట మండలంలోని చల్మెడ గ్రామంలో ఆయిల్ పామ్ మొక్కలు రైతులకు అందుబాటులో సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు.జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు.ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన మరియు నిరంతర ఆదాయం లభిస్తుందని అలాగే కోతులు,దొంగలు,తుపాన్లు వంటి సమస్యల వల్ల ఈ పంటకు పెద్దగా నష్టం ఉండదని వివరించారు.అందువల్ల రైతులు పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగు వైపు ముందుకు రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి రచన,లివ్ పామ్ జిల్లా మేనేజర్ కృష్ణారావు, నర్సరీ మేనేజర్ ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి మున్సిపాలిటీలో రూ.90లక్షలకు పైగా ప్రభుత్వ ఆస్తుల అక్రమ విక్రయం..?

**సమగ్ర విచారణ జరిపి బాధ్యులను అరెస్ట్ చేయాలి..**



**కామారెడ్డి,జూన్09 (సూర్యరేఖ)** కామారెడ్డి మున్సిపాలిటీకి చెందిన ప్రభుత్వ ఆస్తులు, స్క్రాప్ సామగ్రి,కాపర్ వస్తువులు,పాత మోటార్లు మరియు ఇతర విలువైన సామగ్రిని అక్రమంగా తరలించి విక్రయించడం ద్వారా రూ.90లక్షలకు పైగా ప్రభుత్వానికి నష్టం వాటిల్లిందని 20వ వార్డు కౌన్సిలర్ కల్లెం సావిత్రిసత్యం తీవ్ర ఆరోపణలు చేశారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు,ఎస్పీ లకులకు సమర్పించిన ఫిర్యాదులో వారు డిమాండ్ చేశారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని వాటర్ ఫిల్టర్ బెడ్ గోదాం,బుర్ర మత్తడి,పెద్ద చెరువు ప్రాంతం, వాటర్ బెడ్ ట్యాంక్ సమీప ప్రాంతాలు మరియు జాతీయ రహదారి పక్కన నిల్వ ఉంచిన స్క్రాప్ సామగ్రి,కాపర్ వస్తువులు,పాత మోటార్లు తదితర విలువైన ప్రభుత్వ ఆస్తులను 2024 డిసెంబర్ 10వ తేదీ రాత్రి కొందరు వ్యక్తులు కూలీల సహాయంతో ఎటువంటి అధికారిక అనుమతులు లేకుండా తరలించినట్లు స్థానికంగా సమాచారం వెలుగులోకి వచ్చిందని ఆమె తెలిపారు.ఈ ఘటనపై ఇప్పటికే 2024 డిసెంబర్15న మున్సిపల్ కౌన్సిలర్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా,డిసెంబర్ 16న మున్సిపల్ కమిషనర్‌కు,డిసెంబర్ 21న జిల్లా కలెక్టర్‌కు కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందజేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకున్నారో ప్రజలకు తెలియజేయలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## పాపిరెడ్డికాలనీ ప్రాంతాలకు వెంటనే బస్సుసౌకర్యం కల్పించాలి..

**బీఆర్ఎస్ నాయకులు మరబోయిన రవియాదవ్**



**శేరిలింగంపల్లి,జూన్09(సూర్యరేఖ)** శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల రవాణా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నాయకులు మరబోయిన రవియాదవ్,స్థానిక ప్రజలు,బీఆర్ఎస్ కుటుంబ సభ్యులతో కలిసి హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.పాపిరెడ్డి కాలనీ,ఆర్‌జీకేకాలనీ,సురభికాలనీ,ఆరంభ్ టౌన్‌షిప్ ప్రాంతాలకు వెంటనే ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా రవియాదవ్ మాట్లాడుతూ...ఈ ప్రాంతాల్లో వేలాది మంది ప్రజలు నివాసం ఉంటున్నప్పటికీ ఇప్పటికీ సరైన బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఉద్యోగాలకు,పాఠశాలలకు, కళాశాల లకు వెళ్లే విద్యార్థులు,మహిళలు,వృద్ధులు ప్రతిరోజూ అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఆటో డ్రైవర్లు అధిక ఛార్జీలు వసూలు చేయడంతో పేద,మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని,ముఖ్యంగా హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ,ప్రైవేట్ ఉద్యోగాల్లో పనిచేసే కార్మికులు తమ సంపాదనలో పెద్ద భాగాన్ని ప్రయాణ ఖర్చులకే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే బస్సు సర్వీసులను ప్రారంభించాలని, లేనిపక్షంలో ప్రజల తరఫున బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ప్రజల ప్రయాణ హక్కు కోసం పోరాటం కొనసాగుతుందని బస్సు సౌకర్యం కల్పించే వరకు బీఆర్ఎస్ వెనక్కి తగ్గదని అన్నారు.


## ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించిన తాజా,మాజీ కార్పొరేటర్లు



**శేరిలింగంపల్లి,జూన్09(సూర్యరేఖ)** మియాపూర్ లో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభను పెద్ద ఎత్తున విజయవంతం చేసిన సందర్భంగా శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ ఆరెకపూడి గాంధీని మంగళవారం తాజా,మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్,నార్నె శ్రీనివాస్,ఉప్పలపాటి శ్రీకాంత్ కలిసి ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియచేసారు.ఈ సందర్భంగా ఎమ్ఎల్ఏ మాట్లాడుతూ...శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సుమారుగా రూ.2000కోట్లతో మియాపూర్ చౌరస్తా ఫ్లైఓవర్,సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ప్రధాన కార్యాలయం,ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వాగతం పలికారు.నా తరుపున,శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలియచేస్తున్నాను.అదేవిధంగా సభను విజయవంతం చేయడానికి రాత్రి పగలు అనే తేడా లేకుండా అహర్నిశలు కృషి చేసిన నియోజకవర్గ ప్రజలకు,తాజా మాజీ కార్పొరేటర్లకు, నాయకులకు, కార్యకర్తలకు,మహిళ సోదరీమణులకు,పాత్రికేయ మిత్రులకు, అధికారులకు,అనాధికారులకు, అభిమానులకు, శ్రేయభిలాషు లకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చంద్రకాంత్, గోపాల్,త్రిమూర్తి రాజు,లింగం,సుధాకర్,సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రభుత్వ హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ బి.రమేష్,కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇన్స్పిరేషనల్ అవార్డు..

**సర్జరీల్లో విశేష సేవలకు జాతీయస్థాయిలో గుర్తింపు..**



**ఖమ్మం,జూన్09(సూర్యరేఖ)** ఖమ్మం జిల్లా కల్లూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో జనరల్ సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ బి.రమేష్ కి ప్రతిష్టాత్మక డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇన్స్పిరేషనల్ అవార్డు -2026' లభించింది.
వైద్య రంగంలో,ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు అందిస్తున్న సేవలకు గాను జివ్రాన్ ఫౌండేషన్ ఈ అవార్డును ప్రదానం చేసింది.డాక్టర్ బి.రమేష్ కల్లూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో అత్యాధునిక సర్జరీలు చేస్తూ పేద రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు.సర్జరీ ద్వారా తక్కువ ఖర్చుతో,త్వరగా కోలుకునే విధంగా వందలాది శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించారు.ప్రభుత్వ హాస్పిటల్‌లోనే ఇలాంటి సేవలు అందించడం పట్ల రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు."ప్రభుత్వ వైద్యుడిగా ప్రజలకు సేవ చేయడమే నా కర్తవ్యం..ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది"అని డాక్టర్ రమేష్ ఈ సందర్భంగా తెలిపారు.ఈ అవార్డు రావడం పట్ల కల్లూరు ప్రజాప్రతినిధులు,వైద్య సిబ్బంది,రోగుల బంధువులు డాక్టర్ ని అభినందించారు

# గోదాములు సరిపోక.. మార్కెట్‌లోనే పంట

**వర్షంతో పంట ఉత్పత్తులు తడిసి అవస్థలు పడుతున్న రైతులు**

**పంట తరలింపులో తీవ్ర జాప్యం.. నష్టపోతున్న అన్నదాతలు**

**బీఆర్ఎస్ హయాంలోనే రూ.22.50 కోట్లతో తొమ్మిది గోదాముల నిర్మాణం**




**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా మార్క్‌ఫెడ్ ద్వారా పంటలు కొనుగోలు చేస్తున్నా.. వాటిని నిల్వ చేసుకొనేందుకు గోదాములు లేకపోవడంతో మార్కెట్ యార్డుల్లోనే పేరుకుపోతున్నాయి. జొన్న కొనుగోళ్లు ముగియగా.. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో 50 వేల క్వింటాళ్లకు పైగా జొన్న సంచులు నిల్వ ఉన్నాయి. ప్రభుత్వం కొనుగోలు చేసిన సోయా, కంది, శనగ, మక్క, జొన్న పంటలను సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ, ఇతర గోదాముల్లో భద్రపరుస్తుంది. వానకాలం, యాసంగిలో కొనుగోలు చేసిన పంటలతో గోదాములు నిండిపోయాయి. 1.12 లక్షల ఎకరాల్లో జొన్న సాగవగా.. 6 లక్షల క్వింటాళ్ల పంటను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసింది. ఈ పంటను నిల్వ చేసుకొనేందుకు ప్రభుత్వ గోదాములు సరిపోక.. ప్రైవేటు గోదాములను కిరాయికి తీసుకున్నారు. ప్రైవేటు గోదాములు కూడా నిండిపోగా మార్కెట్ యార్డుల్లో పంట నిల్వలు ఉన్నాయి. దీంతో అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు గోదాముల కోసం వెతుకుతున్నారు. వానకాలం ప్రారంభమవగా.. జిల్లాలో వర్ష సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించించిన నేపథ్యంలో పంట తడిసిపోయి నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.తెలంగాణ ప్రభుత్వ అప్పులు

**రూ.22.50 కోట్లతో తొమ్మిది గోదాములను నిర్మించిన బీఆర్ఎస్ ప్రభుత్వం**

రైతులు పండించిన పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిల్వ చేసుకొనేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇందు లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా రూ.22.50 కోట్లతో తొమ్మిది గోదాములను నిర్మించింది. 45 వేల మెట్రిక్ టన్నుల పంటలను నిల్వ చేసుకొనే సామర్థ్యం ఉన్న ఈ గోదాములు రైతులకు ఉపయోగపడుతున్నాయి. ఇచ్చోడ మా ర్కెట్ యార్డులో రూ.1.50 కోట్లతో 2500 మె ట్రిక్ టన్నుల నిల్వగల గోదాం, నార్నూర్‌లో రూ. 3 కోట్లతో 5 వేల మెట్రిక్ టన్నులు, బేలలో రూ.3 కోట్లతో 5 వేల మెట్రిక్ టన్నులు, బోథ్‌లో రూ.3 కోట్లతో 5 వేల మెట్రిక్ టన్నులు, తలమడుగులో రూ.3 కోట్లతో 5 వేల మెట్రి క్ టన్నులు, తాంసి మండలంలోని బండల నాగాపూర్‌లో రూ.3 కోట్లతో 5వేల మెట్రిక్ టన్నులు, ఇంద్రవెల్లి మండలం ధనోరలో రూ.3 కోట్లతో 5వేల మెట్రిక్ టన్నులు, గుడిహత్నూర్ మండలం కొల్హారిలో రూ.3 కోట్లతో 5వేల మెట్రిక్ టన్నులు, ఉట్నూర్‌లో రూ.3 కోట్లతో 5వేల మెట్రిక్ టన్నులు సామర్థ్యం గల గోదాముల నిర్మాణాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగాయి. ప్రస్తుతం ఈ గోదాములు రైతులకు ఉపయోగపడుతున్నాయి.

# వేగంగా సర్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు

**నిర్మల్ :** ఓటర్ల జాబితా ప్రక్షాళనకు కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా రెండు రోజుల క్రితం అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, నిజమైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో అర్హులైన ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, ఓట్ల తొలగింపు ప్రక్రియలు చేపట్టనున్నారు. అన్ని సవరించిన తర్వాత కొత్త ఓటర్ల జాబితాను విడుదల చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)కు శ్రీకారం చుట్టింది. ప్రతి 25 ఏళ్లకు ఒకసారి ఎన్నికల సంఘం ఈ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపడుతున్నది. గతేడాది నవంబర్ నుంచే ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను ప్రారంభించగా, ఇప్పటి వరకు 80 శాతం పూర్తయింది. అత్యధికంగా ముథోల్ నియోజకవర్గంలో 80.74శాతం పూర్తికాగా, నిర్మల్ నియోజకవర్గంలో 80.20శాతం, ఖానాపూర్ నియోజకవర్గంలో 78శాతం మ్యాపింగ్ పూర్తయింది. ప్రతి పోలింగ్ బూత్‌లో 1000-1200 మంది ఓటర్లు ఉండే విధంగా చూసి మ్యాపింగ్ చేస్తారు. ఈ మ్యాపింగ్ ప్రకారం ఆయా బూత్‌స్థాయి అధికారి ఇంటింటికీ వెళ్లి ఓటరు అర్హతలను పరిశీలించి నిర్ధారిస్తారు. 2002కు ముందు పుట్టిన ఓటరు నమోదుపై తండ్రి, కుటుంబ సభ్యులు, రక్త సంబంధీకుల ధ్రువీకరణలను పరిశీలిస్తారు. ఇందుకోసం 12 ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒకటి చూపించాలి. అలాంటి రుజువులు చూపితేనే ఓటరు జాబితాలో ఓటరుగా కొనసాగుతారు. ఒకవేళ సరైన ధ్రువ పత్రాలు లేకుంటే నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చి ఓటరు జాబితా నుంచి పేర్లను తొలగిస్తారు. అలాగే రెండు చోట్ల ఓట్లు ఉన్నవారిని, మరణించిన వారి పేర్లను తొలగించడానికి చర్యలు చేపట్టనున్నారు. ఈ నెల 15వ తేదీలోగా 100 శాతం మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసి, ఆ తర్వాత ఇంటింటికీ తిరిగి ఓటర్ల సమగ్ర విచారణ(సవరణ) కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఈ నెల 25 నుంచి వచ్చే నెల 24 వరకు నెల రోజులపాటు ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కొనసాగనున్నది. కలెక్టర్‌తోపాటు అడిషనల్ కలెక్టర్, డీఆర్వోలు మ్యాపింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తూ ఈఆర్వో, ఏఈఆర్వోలకు అవసరమైన సూచనలు ఇస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు.




నియోజకవర్గ స్థాయిలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఈఆర్వో)లు పర్యవేక్షిస్తుండగా, మండలాల్లో అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఏఈఆర్వో)లు బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాత జూలై 31న ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల చేస్తారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే, వాటిని కూడా సరిచేసి అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు.

**పార్టీల వారీగా ఏజెంట్ల నియామకం**

ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా, పారదర్శకతతో రూపొందించేందుకు పోలింగ్ కేంద్రాల వారీగా ఏజెంట్లను నియమించుకునేందుకు ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలకు అనుమతించింది. నిర్మల్ జిల్లాలో మొత్తం 925 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 925 మంది బీఎల్‌వోలు మ్యాపింగ్‌లో పాల్గొన్నారు. అలాగే ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక ఏజెంట్ వంతున ఆయా పార్టీలు తమ కార్యకర్తలను నియమించుకున్నాయి. వారి పరిధిలో ఓటరు మ్యాపింగ్, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై అభ్యంతరాలు, ఓటర్ల తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించి తప్పులు, సూచనలు ఉంటే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు.

**కేటగిరీలవారీగా ఓటర్ల జాబితా**

నిర్మల్ జిల్లాలో తాజా లెక్కల ప్రకారం మొత్తం 7,55,905 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,63,745 మంది, మహిళలు 3,92,110, ఇతరులు 50 మంది ఉన్నారు. నియోజకవర్గాలవారీగా చూస్తే ఖానాపూర్‌లో 2,30,338 మంది, నిర్మల్‌లో 2,64,314 మంది, ముథోల్‌లో 2,61,253 మంది చొప్పున ఉన్నారు.

ఎన్నికల సంఘం ఆదేశం మేరకు ఓటర్ల జాబితాను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించి మ్యాపింగ్ నిర్వహిస్తున్నారు. ముందుగా 2025 ఓటరు జాబితాను 2026 జాబితాతో పోల్చుతున్నారు.

ఏ కేటగిరీలో 2002, 2025 ఓటరు జాబితాల్లో పేర్లు ఉన్న వారిని గుర్తిస్తున్నారు. బీ కేటగిరీలో 1987, జూలై ఒకటవ తేదీ కంటే ముందు జన్మించిన(38 సంవత్సరాల కిందట) వారిని గుర్తించి వివరాలు నమోదు చేస్తున్నారు. సీ కేటగిరీలో 1987 నుంచి 2001 మధ్య జన్మించిన వారిని గుర్తిస్తున్నారు. డీ కేటగిరీలో 18 నుంచి 21 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారి వివరాలు నమోదు చేస్తున్నారు.

ఇలా ఓటర్ల వివరాలన్నీ బీఎల్‌ఓలు మొబైల్ యాప్‌లో మ్యాపింగ్ చేస్తున్నారు.

## దొంగతుర్తి వద్ద లారీ-బైక్ ఢీ.. యువకుడికి తీవ్ర గాయాలు



**ధర్మారం :** లారీ-బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి మండలం కనగర్తి గ్రామానికి చెందిన ఎల్లంకి అనిల్ (32) అని యువకుడు ద్విచక్ర వాహనంపై ఓ పని మీద ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి వచ్చాడు. పని ముగిసిన అనంతరం గ్రామంలోని ఎస్సీ కాలనీ రోడ్డు నుంచి గ్రామపంచాయతీ వద్ద ఉన్న సమ్మక్క రోడ్డు మీదుగా వస్తున్న క్రమంలో పెద్దపల్లి -- ధర్మారం ఆర్ అండ్ బి రోడ్ ధర్మారం నుంచి పెద్దపల్లి వెళుతున్న లారీ అకస్మాత్తుగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో సదరు యువకుడు ద్విచక్ర వాహనంపై నుంచి పట్టడంతో అతని తలకు దెబ్బ తగలడంతో తీవ్రమైన రక్తస్రావం జరిగింది. దీంతో స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని 108 అంబులెన్స్ వాహనంలో చికిత్స కోసం పెద్దపల్లిలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ అతని పరిస్థితి నిలకడగా లేకపోవడంతో పెద్దపల్లి నుంచి అనిల్ ను కరీంనగర్ కు మెరుగైన చికిత్స కోసం తరలించారు. అనిల్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ప్రమాదానికి గల కారణాలు సేకరిస్తున్నట్లు ధర్మారం ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## ఇస్రో సందర్శనకు గోదావరిఖని బుడతడు.. చైర్మన్‌ను కలిసే అవకాశం

**కోల్ :** బెంగుళూరులోని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)ను సందర్శించడానికి గోదావరిఖని తిలక్ నగర్ కు చెందిన రాకం కిరణ్-శ్వేత దంపతుల కుమారుడు రిశ్విక్ కు ఆహ్వానం లభించింది. అంతర్జాతీయ సంస్థ ఇస్కాన్ గత ఫిబ్రవరి 3న ఆన్లైన్లో నిర్వహించిన ప్రపంచ స్థాయి భగవద్గీత వాల్యూ ఎడ్యుకేషన్ కాంటెస్ట్ లో రిశ్విక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, 95 శాతం కంటే అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జూమ్ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేశారు. ఈ క్రమంలో ఇస్కాన్ సంస్థ ప్రతినిధి ప్రేమ్ రాజ్ చైతన్య రిశ్విక్ కు బహుమతిగా సైకిల్ తోపాటు ప్రశంసా పత్రంను అందజేశారు. ఈనెల 12న బెంగుళూరులోని ఇస్రోను సందర్శించడానికి, నేషనల్ టాపర్స్ అవార్డు సెరిమనీలో పాల్గొనడానికి ఆహ్వానం పంపించారు. ఇస్రో చైర్మన్, ఏరో నాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ సోమనాథ్ ను కలిసే అవకాశంతోపాటు ఆయనతోపాటు గ్రూప్ ఫొటో, డమ్మీ రాకెట్ లాంచింగ్ డెమోను తిలకించడానికి తల్లిదండ్రులతో కలిసి రిశ్విక్ బెంగుళూరు బయలుదేరి వెళ్లాడు. కాగా, గోదావరిఖని కృష్ణవేణి పాఠశాలలో రిశ్విక్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు.

## జూన్ 10న కలెక్టరేట్ ఎదుట సీపీఐ ధర్నాను విజయవంతం చేయాలి..



**మరిపెడ,జూన్09(సూర్యరేఖ)** ప్రజాసమస్యల పరిష్కారం కోసం జూన్10న మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే భారీ ధర్నాలోప్రజలు, రైతులు, కార్మికులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్ పిలుపునిచ్చారు. సీపీఐ మహ బూబాబాద్ జిల్లా సమితి పిలుపు మేరకు నిర్వహించనున్న ఈధర్నా సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ...కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని,అర్హులైన ప్రతి ఒక్కరికి నెలకు రూ.4,000పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు.అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా అమలు చేసి అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని,పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు.డిజిల్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించి పథకాన్ని కొనసాగించాలని,ప్రజాసంక్షేమ పథకాలను సమర్థవం తంగా అమలు చేయాలని ఆయన కోరారు.ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విషయంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు ప్రజల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న జూన్ 10ధర్నాలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎండి అబ్దుల్ రషీద్ విజ్ఞప్తి చేశారు.

## కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత..ఇద్దరు నిందితుల అరెస్ట్.!



**కామారెడ్డి,జూన్ 09(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి బి.హన్మంతరావు ఆదేశాల మేరకు మంగళవారం కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ అధికారులు రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. సంబల్పూర్ నుండి నాందేడ్ వెళ్లే 'నాగవలి ఎక్స్‌ప్రెస్' (ట్రైన్ నంబర్: 20809)లో తనిఖీలు చేస్తుండగా.. ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులు పట్టుబడ్డారు.వారిని తనిఖీ చేయగా వారి వద్ద నుండి 10కిలోల ఎండు గంజాయి లభ్యమైందివివరాల ప్రకారం.. నిందితులు మహారాష్ట్రలోని జాల్నా జిల్లాకు చెందిన సునీల్ మరియు ప్రవీణ్, నిందితులు ఒడిశాలోని రాయగడలో ఎండు గంజాయిని కొనుగోలు చేసి, మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుబడినట్లు కామారెడ్డి ఎక్సైజ్ సీఐ సిహెచ్ సంపత్ కృష్ణ తెలిపారు.నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ విజయవంతమైన తనిఖీలలో ఎక్సైజ్ సీఐ సిహెచ్.సంపత్ కృష్ణ,ఎస్ఐ ఎం.విక్రమ్ కుమార్,హెడ్ కానిస్టేబుళ్లు జాన్,బలవంతరావు, ఫరూఖ్ మరియు సిబ్బంది రాజు,పవన్ రెడ్డి,బాబు, శరత్,వందన తదితరులు పాల్గొన్నారు.

## పేదల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం..

**పేద ప్రజలపై అదనపు భారాలు మోపే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి..**

**గ్యాస్ సబ్సిడీని పూర్తిస్థాయిలో పునరుద్ధరించి ధరలను తగ్గించాలి..**

**ఐద్వా మండల నాయకురాలు జిన్నా మాధవి**



**మరిపెడ,జూన్09(సూర్యరేఖ)** కేంద్ర ప్రభుత్వం పేదల నడ్డి విరుస్తుందని, కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను పెంచడంతో పాటు సబ్సిడీలను క్రమంగా తగ్గించడం వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నాయని ఐద్వా మండల నాయకురాలు జిన్నా మాధవి విమర్శించారు.మంగళవారం మరిపెడలో ఆమె మాట్లాడుతూ... ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం లబ్ధిదారులకు అందిస్తున్న సబ్సిడీ సిలిండర్ల సంఖ్యను ఎనిమిది నుంచి నాలుగుకు తగ్గించడం అన్యాయమని పేర్కొన్నారు.ఇటీవల గ్యాస్ సిలిండర్ ధరపై రూ.29పెంపు చేయడం వల్ల కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.నిత్యావసర వస్తువుల ధరలు ఇప్పటికే పెరిగిపోతున్న నేపథ్యంలో గ్యాస్ ధరల పెంపు,సబ్సిడీ కోతలతో వంట ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడిందని ఆమె అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలు తమ నెలవారీ ఆదాయంలో గణనీయమైన భాగాన్ని గ్యాస్ కొనుగోలుకే వెచ్చించాల్సి వస్తోందని,దీంతో కొందరు తిరిగి కట్టెల పొయ్యిల వినియోగం వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు.పేద ప్రజలపై అదనపు భారాలు మోపే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని,గ్యాస్ సబ్సిడీని పూర్తిస్థాయిలో పునరుద్ధరించి ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు నిరసనగా మహిళా సంఘాలు,ప్రజాసంఘాలు కలిసి ఉద్యమాలు చేపడతాయని జిన్నా మాధవి హెచ్చరించారు.

# విశాఖ ఉక్కువిషాదం..9మంది కార్మికుల ప్రాణాలు బలిగొన్న నిర్లక్ష్యం



**బెల్లంపల్లి,జూన్09(సూర్యరేఖ)** విశాఖ ఉక్కుకర్మాగారంలో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదంలో మృతి చెందిన తొమ్మిది మంది కార్మికులకు బెల్లంపల్లిలోని టీఎన్‌టీయూసీ కార్యాలయంలో నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి టి. మణిరామ్ సింగ్ మాట్లాడుతూ...జూన్ 8న విశాఖ ఉక్కు కర్మాగారంలో ల్యాడిల్ పేలిపోవడంతో తొమ్మిది మంది కార్మికులు అక్కడికక్కడే మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. మరికొంత మంది కార్మికులు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు.ఈ ప్రమాదానికి స్టీల్ ప్లాంట్ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.ఉత్పత్తి పెంపుపై శ్రద్ధ చూపుతున్న యాజమాన్యం కార్మికుల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ విషాదంచోటుచేసుకుందని ఆరోపించారు. కాంట్రాక్టు విధానం,ప్రైవేటీకరణ,అవుట్‌సోర్సింగ్ కారణంగా కార్మికుల రక్షణకు భంగం కలుగుతోందని పేర్కొన్నారు.కాంట్రాక్టు విధానాన్ని నిలిపివేసి కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రమాదంలో మరణించిన ప్రతి కార్మికుడి కుటుంబానికి రూ.1కోటి నష్టపరిహారం చెల్లించడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.గాయపడిన కార్మికులకు అత్యుత్తమ వైద్యసదుపాయాలు అందించి, వారు పూర్తిగా కోలుకునే వరకు వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఎల్‌యూ ఉపాధ్యక్షులు గద్దెల నారాయణ, జిల్లా అధ్యక్షులు ఓ. జీవరత్నం,టీఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొల్లు మల్లయ్య,కొత్తూరి నారాయణ, ఎం.గోపాల్,పుల్లూరి పోశం,ఎండీ అస్గర్ భాష తదితరులు పాల్గొని మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కామారెడ్డి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆహార భద్రత సలహా కమిటీ సమావేశం...



**కామారెడ్డి,జూన్10(సూర్యరేఖ)** జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఆహారభద్రత సలహా కమిటీ సమావేశం నిర్వహించారు.ఆహార భద్రత అధికారి జి.విక్రమ్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. పాఠశాలలు రెసిడెన్షియల్ హాస్టళ్లలోని వంటవారు తప్పనిసరిగా మంచి పరిశుభ్రత పద్ధతులు పాటించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఆహార భద్రతశాఖ, విద్యాశాఖ,సంక్షేమశాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# గర్భిణీలు తప్పనిసరిగా ఉచితద వైద్య సేవలను వినియోగించుకోవాలి..

**పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి**

**మరిపెడ పీహెచ్‌సీలో ఘనంగా సురక్షిత మాతృత్వ దశాబ్ది ఉత్సవాలు..**

**గర్భిణీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు..**



**మరిపెడ,జూన్09 (సూర్యరేఖ)** ప్రతి నెల 9వ తేదీన గర్భిణీలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి సూచించారు.మంగళవారం మరిపెడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పీఎంఎస్‌ఎంఏ) విజయవంతంగా పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం దశాబ్ది ప్రస్థాన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ రవి,డాక్టర్ పూజిత గర్భిణీలకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించారు.రక్తపోటు,మధుమేహం నిర్ధారణ పరీక్షలతో పాటు ఉచిత ల్యాబ్ పరీక్షలు చేపట్టారు.అలాగే హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించి రక్తహీనత సమస్యలను గుర్తించారు.కాన్పు సమయంలో సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉన్న హైరిస్క్ గర్భిణీలను గుర్తించి వారికి ప్రత్యేక వైద్య సలహాలు, చికిత్స అందించారు.గర్భిణీలందరికీ అవసరమైన ఉచిత మందులు,ఐరన్ మరియు కాల్షియం మాత్రలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ...ప్రతి నెల9వ తేదీన గర్భిణీలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు.గర్భధారణ సమయంలో సమతుల్య పోషకాహారం తీసుకోవడం,సకాలంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా మాతృ,శిశు మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఆచార్యులు, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మీకుమారి ,ఏఎన్ఎం అశ్విని,ఆశా కార్యకర్తలు,ఆసుపత్రి సిబ్బంది పాల్గొని గర్భిణీలకు సేవలందించారు.

## ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ కు గోదా వెంకటేశ్వర్లు గౌడ్ బృందం శుభాకాంక్షలు..



**నాంపల్లి,హైదరాబాద్,జూన్09(సూర్యరేఖ)** కార్వాన్ నియోజకవర్గం ఏఐ ఎం ఐఎం పార్టీ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ పవిత్ర హజ్ యాత్ర విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా గుడిమల్కాపూర్ డివిజన్ నుండి పోటీ చేసిన కార్పొరేటర్ గోదా వెంకటేశ్వర్లుగౌడ్,నాగరాజు,లు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్,ను టోలిచౌకిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ సందర్భంగా గోదా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ...ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉండే మంచి మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో,ఆనందంగా ఉంటూ ప్రజలకు సేవ చేయడంలో నిరంతరం విజయం సాధించాలని కోరుకుంటున్నామన్నారు

# అమృతకాలనీలో రూ.1.5 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం..





**నిధులు మంజూరు చేయించిన మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి**

**పనులు పరిశీలించిన మాజీ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి**



**ఉప్పల్,జూన్09(సూర్యరేఖ)** శివారు కాలనీలా అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్టుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఉమ్మడి జీహెచ్ఎంసీ పరిధిలోని కాలనీలతో సమానంగా అభివృద్ధి చేయనున్నట్లుగా చెప్పారు.ఉప్పల్ డివిజన్ లోని అమృతకాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీవాసులు ఇటీవల ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి దృష్టికి తెచ్చారు.దీంతో రజితపరమేశ్వర్ రెడ్డి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.5 కోట్ల నిధులను మంజూరు చేయించారు.కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు.కాలనీలో నెలకొన్న ఇతర సమస్యల పరిష్కారానికి కూడా కావాల్సిన నిధులను మంజూరు చేయించి, పనులను చేయించేలా కృషి చేస్తానని రజితప ్రమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఎర్ర ఐలేష్ యాదవ్,కాలనీ జనరల్ సెక్రటరీ పసునూరి బిక్షపతి , పద్మ బిక్షపతి,సల్లా ప్రభాకర్ రెడ్డి,కాలనీ కోశాధికారి రంగయ్య,సావిత్రి రంగయ్య, రాజశేఖర్,కాలనీ గౌరవ సభ్యులు నరసింహారెడ్డి, సురేంద్రబాబు,మహేందర్, రమేష్, లోకేష్,భాను ప్రసాద్,ఫిలిప్స్,గౌరవ సభ్యులు నాగరాజు,కొట్టే శ్రీనివాస్,రఘు మోహన్ రెడ్డి, ఎల్ఎన్ రెడ్డి,నాగేశ్వరరావు,కుమార్ స్వామి, మక్బూల్, సుభాష్, కృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేష్, శ్రీనివాస్,ఐ ఎన్ రెడ్డి ,రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## జూన్16జరిగే రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి ..

## కైపోస్టర్ ఆవిష్కరణ



**ఉప్పల్,జూన్09(సూర్యరేఖ)** ఉప్పల్ బీరప్పగడ్డ ప్రజాసంఘాల కార్యాలయంలో తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జూన్16న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సు పోస్టర్ ను మంగళవారం ఆవిష్కరించారు.అనంతరం సంఘం రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి రాజునాగరాజు మాట్లాడుతూ...బ్యాండ్ కళాకారులను గత కొంతకాలంగా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు ప్యాడ్ బ్యాండ్ సీజ్ చేయడం పోలీసుల దురుసుతనం సౌండ్ నియంత్రణ చేయక పోవడం లాంటి అంశాలతో బ్యాండ్ కళాకారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.పెళ్లిళ్ల సీజన్లో వెహికల్స్ సిజ్ చేయడంతో ఉపాధి కోల్పోయి ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు.సాంస్కృతిక శాఖ బ్యాండ్ కళాకారులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుంది.గత పదిహేళ్లుగా ఒక్క బ్యాండ్ కళాకారుడికి గుర్తింపు కార్డు ఇవ్వలేదని,ప్రమాదాల గురైన వారికి సహకారం చేయలేదు.కనుకనే బ్యాండ్ కళాకారులకు సపరేట్ ఫెడరేషన్ ఏర్పాటు చేసి 1000కోట్ల నిధులు కేటాయించి యూనిట్ కి 10లక్షల రుణం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ సీఐటీయూ జోన్ సెక్రటరీ జె.వెంకన్న,బివిఎస్ కే నాయకులు హుస్సేన్,కార్తీక్ తదితరులు పాల్గొన్నారు..

# ప్రైవేటు పాఠశాలల వ్యాపారం..కమిషన్లు దండుకుంటున్న విద్యాశాఖ అధికారులు

**గ్రేటర్ హైదరాబాద్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి గుర్రం రాఘవేందర్**

**ఉప్పల్,జూన్09(సూర్యరేఖ)** నూతన విద్యసంవత్సరం2026-27 పురస్కరించుకొని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కార్పొరేట్,ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలను అతిక్రమిస్తూ పాఠ్యపుస్తకాలు,నోట్ పుస్తకాలు, యూనిఫామ్,లను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి గుర్రం రాఘవేందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...విద్యను వ్యాపారంగా మారుస్తున్న విద్యాశాఖ అధికారులు ముడుపులు పుచ్చుకొని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన ప్రభుత్వ సిఎస్ ,హైదరాబాద్,మేడ్చల్ జిల్లాల కలెక్టర్లకు, ఆయా జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆధారాలతో పాటు పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. జీవో నెంబర్91 సెక్షన్,1(సి)ప్రకారం పాఠ్యపుస్తకాలు స్టేషనరీ యూనిఫామ్,లను పాఠశాలలో అమ్మడం నేరమని జీవోలో ఉన్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. పాంశాలల యాజమాన్యాలు సూచించిన చోట కూడా పాఠ్యపు స్తకాలు నోటి పుస్తకాలు స్టేషనరీ కొనడం నిషేధమని తెలిసినప్పటికిని అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.. 1. 1999జీవో ప్రకారం విద్య వ్యాపారం చేయవద్దని ఉన్నప్పటికీని గ్రేటర్ పరిధిలోని అన్ని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేటర్ పరిధిలోని అన్ని ప్రైవేటు కాకొ్పరేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ పాఠశాలలోనే పాఠ్యపుస్త కాలు నోటు పుస్తకాలు యూనిఫామ్,లు కొనాలని ఒత్తిడి తేవడంతో తప్పని పరిస్థితుల్లో పేద,మధ్య తరగతి తల్లిదండ్రులు వేలాది రూపాయలు వెచ్చించి అక్కడే కొనాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. గ్రేటర్ పరిధిలోని అన్ని ప్రైవేటు,కార్పొరేట్ పాఠశాలల్లో బహిరంగం గానే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు,యూనిఫాంలు కొనాలని బహిరంగంగానే బోర్డులు ఏర్పాలు చేసి మరి విక్రయిస్తున్న విద్యాశాఖ ఆధికారులు ముడుపు లందుకొని వాటిపై చర్యలు తీసుకోవడం లేదని రాఘవేందర్ ఆరోపించారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతా అదికారులు నిబంధనలు ఉల్లంఘించి పాఠ్యపుస్తకాలు,నోట్ పుస్తకాలు యూనిఫామ్,లు విక్రయిస్తున్న ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రాఘవేందర్ డిమాండ్ చేశారు.



## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో
# బీరప్ప గడ్డలో నూతన మంచినీటి పైప్ లైన్ ఏర్పాటు..





**ఇచ్చిన మాట నిలబెట్టుకునా మాజీ కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్**

**ఉప్పల్,జూన్09(సూర్యరేఖ)** బీరప్పగడ్డ డివిజన్ రామాలయం వెనకాల వీధిలో నూతనంగా నిర్మిస్తున సీసీ రోడ్ పనులలో భాగంగా అక్కడి బస్తీ వాసుల అభ్యర్థన మేరకు బాగా పాడైపోయిన,తరచుగా పొల్యూషన్,వాటర్ లో ప్రెజర్ ఉన్నందున పాత మంచినీళ్ళ పైప్ లైన్ మార్చి నూతన పైప్ లైన్ వేయాల్సిందిగా బీరప్పగడ్డ బస్తీ వాసులు మాజీ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ని కోరడం జరిగింది. వెంటనే స్పందించిన మాజీ కార్పొరేటర్ గీతాప్రవీణ్,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో హెచ్ఎమ్ డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజ,జనరల్ మేనేజర్ సంతోష్,లతో మాట్లాడి నూతన వాటర్ పైప్ లైన్ ను బస్తీ వాసులకి మంగళవారం ఏర్పాటు చేయడం జరిగింది. చెప్పిన వెంటనే అసాధ్యం అయినా పనిని ఎమ్మెల్యే సాకారంతో కార్పొరేటర్ గీతాప్రవీణ్ నూతన వాటర్ పైప్ లైన్ ఏర్పాటు చేయించారు. బస్తీ వాసులు కార్పొరేటర్ కి కృతజ్ఞతలు తెలిపారు. అసాధ్యని కూడా సుసాధ్యం చేసే నాయకుడు బన్నాల ప్రవీణ్ అని బస్తీ వాసులు ప్రవీణ్ కి ఎప్పటికీ రుణపడి ఉంటామని అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,వంజరి నర్సింగరావు, పండ్ల కిషన్ గౌడ్,బంటి గౌడ్,తిరుపతి యాదవ్,శ్రీనివాస్ యాదవ్,భాస్కర్ ముదిరాజ్,వెంకట్ రెడ్డి,ప్రవీణ్ రెడ్డి,జయమ్మ, రమాదేవి, కమలమ్మ, రూప,మంజుల,రాజమణి తదితరులు పాల్గొన్నారు.

# గోదాములు సరిపోక.. మార్కెట్‌లోనే పంట

**వర్షంతో పంట ఉత్పత్తులు తడిసి అవస్థలు పడుతున్న రైతులు**

**పంట తరలింపులో తీవ్ర జాప్యం.. నష్టపోతున్న అన్నదాతలు**

**బీఆర్ఎస్ హయాంలోనే రూ.22.50 కోట్లతో తొమ్మిది గోదాముల నిర్మాణం**

**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా మార్క్‌ఫెడ్ ద్వారా పంటలు కొనుగోలు చేస్తున్నా.. వాటిని నిల్వ చేసుకొనేందుకు గోదాములు లేకపోవడంతో మార్కెట్ యార్డుల్లోనే పేరుకుపోతున్నాయి. జొన్న కొనుగోళ్లు ముగియగా.. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో 50 వేల క్వింటాళ్లకు పైగా జొన్న సంచులు నిల్వ ఉన్నాయి. ప్రభుత్వం కొనుగోలు చేసిన సోయా, కంది, శనగ, మక్క, జొన్న పంటలను సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ, ఇతర గోదాముల్లో భద్రపరుస్తుంది. వానకాలం, యాసంగిలో కొనుగోలు చేసిన పంటలతో గోదాములు నిండిపోయాయి. 1.12 లక్షల ఎకరాల్లో జొన్న సాగవగా.. 6 లక్షల క్వింటాళ్ల పంటను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసింది. ఈ పంటను నిల్వ చేసుకొనేందుకు ప్రభుత్వ గోదాములు సరిపోక.. ప్రైవేటు గోదాములను కిరాయికి తీసుకున్నారు. ప్రైవేటు గోదాములు కూడా నిండిపోగా మార్కెట్ యార్డుల్లో పంట నిల్వలు ఉన్నాయి. దీంతో అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు గోదాముల కోసం వెతుకుతున్నారు. వానకాలం ప్రారంభమవగా.. జిల్లాలో వర్ష సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించించిన నేపథ్యంలో పంట తడిసిపోయి నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తెలంగాణ ప్రభుత్వ అప్పులు

**రూ.22.50 కోట్లతో తొమ్మిది గోదాములను నిర్మించిన బీఆర్ఎస్ ప్రభుత్వం**

రైతులు పండించిన పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిల్వ చేసుకొనేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇందు లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా రూ.22.50 కోట్లతో తొమ్మిది గోదాములను నిర్మించింది. 45 వేల మెట్రిక్ టన్నుల పంటలను నిల్వ చేసుకొనే సామర్థ్యం ఉన్న ఈ గోదాములు రైతులకు ఉపయోగపడుతున్నాయి. ఇచ్చోడ మా ర్కెట్ యార్డులో రూ.1.50 కోట్లతో 2500 మె ట్రిక్ టన్నుల నిల్వగల గోదాం, నార్నూర్‌లో రూ. 3 కోట్లతో 5 వేల మెట్రిక్ టన్నులు, బేలలో రూ.3 కోట్లతో 5 వేల మెట్రిక్ టన్నులు, బోథ్‌లో రూ.3 కోట్లతో 5 వేల మెట్రిక్ టన్నులు, తలమడుగులో రూ.3 కోట్లతో 5 వేల మెట్రి క్ టన్నులు, తాంసి మండలంలోని బండల నాగాపూర్‌లో రూ.3 కోట్లతో 5వేల మెట్రిక్ టన్నులు, ఇంద్రవెల్లి మండలం ధనోరలో రూ.3 కోట్లతో 5వేల మెట్రిక్ టన్నులు, గుడిహత్నూర్ మండలం కొల్హారిలో రూ.3 కోట్లతో 5వేల మెట్రిక్ టన్నులు, ఉట్నూర్‌లో రూ.3 కోట్లతో 5వేల మెట్రిక్ టన్నులు సామర్థ్యం గల గోదాముల నిర్మాణాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగాయి. ప్రస్తుతం ఈ గోదాములు రైతులకు ఉపయోగపడుతున్నాయి.



## కోటిలింగాల స్థాపన మహోత్సవ కార్యక్రమానికి ఎంపీ ఈటెల రాజేందర్ ను ఆహ్వానించిన కమిటీ ప్రతినిధులు..



**ఉప్పల్,జూన్09(సూర్యరేఖ)** చిలుకానగర్ శివాలయంలో కోటిలింగాల స్థాపన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ని ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రం అందజేసి ఆహ్వానించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఎంపీని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అధ్యక్షులు దాసరి కృష్ణ,ప్రధాన కార్యదర్శి గోనె శ్రీకాంత్, ఉపాధ్యక్షులు చాతారసి సిదిరాజు,గోనె అంజయ్య, కావాలి నరసింహ,తులసిరాం తదితరులు పాల్గొన్నారు.

## జోన్నల కొనుగోలులో జాప్యం రోడ్డుపై రైతన్నలు



**కంగ్టి,జూన్09(సూర్యరేఖ)** జోన్నల ధాన్యం కొనుగోలులో జాప్యం రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తడ్కల్ గ్రామంలో మార్క్ ఫెడ్ మైనార్టీ ఫంక్షన్ హాల్ ఎదుట కంగ్టి-పిట్లం ప్రధాన రహదారిపై బైఠాయించి, సంచులు లారీలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ధర్నాకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ దుర్గారెడ్డి రైతుల వద్దకు వెళ్లి లారీలు వచ్చేలా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు,తదితరులు ఉన్నారు.

## లూనావత్ తండాలో ప్రమాదకరంగా మారిన పాత బావి..

**ప్రజల భద్రత దృష్ట్యా బావిని వెంటనే పూర్తిగా పూడ్చివేయాలని తండావాసుల వినతి..**



**మరిపెడ,జూన్09(సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం లూనావత్ తండాలో ఉన్న పాతబావి ప్రస్తుతం ప్రమాదకర స్థితికి చేరుకోవడంతో దానిని వెంటనే పూడ్చివేయాలని తండావాసులు కోరుతున్నారు. తండా సమీపంలో ఉన్న ఈ బావి ఎన్నో ఏళ్లుగా ఉపయోగం లేకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. చుట్టూ పొదలు,చెత్తాచెదారం పెరిగిపోవడంతో బావి కనిపించకుండా పోతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తండాలో చిన్నారులు,పశువులు, వృద్ధులు ఈ మార్గంలో తరచూ సంచరిస్తుండటంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని తండావాసులు చెబుతున్నారు. ఇటీవల బావి చుట్టూ ఉన్న చెట్లు,కొమ్మలు విరిగి పడటంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో బావిలో నీరు చేరి లోతు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజల భద్రత దృష్ట్యా బావిని పూర్తిగా పూడ్చివేయడంతో పాటు ఆ ప్రాంతాన్ని శుభ్రపరచి రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. తండా ప్రజల విజ్ఞప్తిని సంభందిత అధికారులు పరిగణనలోకి తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని తండావాసులు కోరుతున్నారు.

## బిజినెస్

# చివరి గంటలో కొనుగోళ్ల జోరు..



గడిచిన రెండు సెషన్లుగా ఇన్వెస్టర్లను కలవరపెట్టిన నష్టాల పరంపరకు మంగళవారం బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలతో పాటు దేశీయంగా బ్యాంకింగ్ రంగంలో వ్యూహాత్మక కొనుగోళ్లు మార్కెట్లకు ఊరటనిచ్చాయి. నేటి ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ (దీూజు ూవఅంవఞ) 394 పాయింట్లు పుంజుకొని 73,918.76 మార్కు వద్ద స్థిరపడింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ (చీూజు చీఱఖీవ 50) కూడా 119 పాయింట్లు లాభపడి 23,242.10 వద్ద ముగిసింది. మధ్యాహ్నం సమయంలో కొంత లాభాల స్వీకరణ జరిగినప్పటికీ చివరి గంటలో కొనుగోలుదారులు ఆసక్తి చూపడంతో సూచీలు తిరిగి పుంజుకున్నాయి.

**మార్కెట్ జోష్‌కు దారితీసిన కారణాలు**

నేటి మార్కెట్ గమనాన్ని విశ్లేషిస్తే ఈ రికవరీకి ప్రధానంగా కొన్ని అంశాలు దోహదపడ్డాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అందులో..

**ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల తగ్గింపు**

పశ్చిమాసియాలో కొన్ని రోజులుగా తీవ్ర రూపం దాల్చిన ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణలు సద్దుమణుగుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఇరు దేశాలు పరస్పర దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం అంతర్జాతీయ మార్కెట్లలో భయాలను తొలగించింది.

క్రూడాయిల్ ధరలు

అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర సుమారు 0.71% తగ్గి బ్యారెల్‌కు 92.75 డాలర్ల వద్దకు చేరింది. భారతదేశం వంటి దిగుమతులపై ఆధారపడే ఆర్థిక వ్యవస్థకు చమురు ధరలు తగ్గడం ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించి మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది.

**ఆర్‌బీఐ బూస్టర్ డోస్.. బ్యాంకింగ్ రంగం హవా**

నేటి మార్కెట్ ర్యాలీకి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం బూస్ట్‌గా మారింది. విదేశీ మూలధనాన్ని ఆకర్షించేందుకు గాను బ్యాంకులు సేకరించే తాజా ఎఫ్‌సీఎన్ఆర్-బీ డిపాజిట్ల కోసం యూఎస్ డాలర్-రూపాయి ఫారెక్స్ స్వాప్ సదుపాయాన్ని ఆర్‌బీఐ ప్రవేశపెట్టింది. కనీసం 3 సంవత్సరాల నుంచి గరిష్టంగా 5 సంవత్సరాల కాలపరిమితి గల డిపాజిట్లకు ఇది వర్తిస్తుంది. ఈ నిర్ణయంతో నిఫ్టీ బ్యాంక్ ఏకంగా 1,255 పాయింట్లు దూసుకెళ్లింది. ఏప్రిల్ 10 తర్వాత బ్యాంక్ నిఫ్టీ సాధించిన అత్యుత్తమ సింగిల్-డే లాభం ఇదే కావడం గమనార్హం. ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ వంటి హెవీవెయిట్ షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి.

**అంతర్జాతీయ మార్కెట్ల మద్దతు**

గత వారం అమెరికా వాల్ స్ట్రీట్‌లో చోటుచేసుకున్న అమ్మకాల ఒత్తిడి నుంచి అంతర్జాతీయ మార్కెట్లు వేగంగా కోలుకున్నాయి. ఆసియా మార్కెట్లలో సెమికండక్టర్, టెక్నాలజీ షేర్లు రాణించాయి

# విమానయానం భారం.. ప్రయాణికులపై చార్జీల ప్రభావం



**రియో డీ జనిరో :** పెరిగిన ఇంధన ధరలతో విమానయాన సంస్థలు.. టికెట్ చార్జీలను పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయి. అయితే చార్జీలు పెరిగితే ప్రయాణి కులు తగ్గిపోయే వీలున్నదని అంతర్జాతీయ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) ప్రధాన ఆర్థికవేత్త మ్యారీ ఓవెన్స్ థామ్సన్ అభిప్రాయపడ్డారు. ధరల వ్యత్యాసాలు ప్రయాణికుల ప్రత్యామ్నాయాల అన్వేషణకు దారితీస్తాయన్నారు. అమెరికా, ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంతో పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం.. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలను ప్రభావితం చేస్తున్న విషయం తెలిసిందే. ఇది సహజంగానే భారత్ వంటి క్రూడాయిల్ దిగుమతి దేశాలను అన్ని రకాలుగా దెబ్బతీస్తున్నది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది విమాన ఇంధనం రేటు 70 శాతం వరకు పెరుగవచ్చన్న అంచనాలున్నాయి. ఈ క్రమంలోనే ఐఏటీఏ పైవిధంగా స్పందించింది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 370కిపైగా ఎయిర్‌లైన్స్‌కు ఐఏటీఏ ప్రాతినిధ్యం వహిస్తున్నది.

**పెంపు అనివార్యం**

విమాన టికెట్ ధరల పెంపు అనివార్యంగానే కనిపిస్తున్నదని ఐఏటీఏ చీఫ్ ఎకనామిస్ట్ థామ్సన్ అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో చార్జీలను పెంచకపోతే నష్టాలపాలయ్యే వీలున్నదని, చివరకు దివాలా తీసే ప్రమాదం కూడా లేకపోలేదని వ్యాఖ్యానించారు. అయితే టికెట్ ధరలు పెరిగితే ప్రయాణికులు ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యానికి చేరుకోవాలని చూస్తారని, ఇది కంపెనీల ఆదాయంపై ప్రభావం చూపగలదని కూడా పేర్కొన్నారు. ఇక 2025తో పోల్చితే 2026లో విమానయాన సంస్థల ఇంధన ఖర్చులు 252 బిలియన్ డాలర్ల నుంచి 350 బిలియన్ డాలర్లకు పెరిగిపోవచ్చని చెప్పారు. కేవలం గల్ఫ్ యుద్ధం దెబ్బకు దాదాపు 40 శాతం అధికమయ్యే అవకాశాలున్నాయన్నారు. గత ఏడాది బ్యారెల్ విమానయాన ఇంధనం ధర సగటున 90 డాలర్లుగా ఉంటే.. ఈ ఏడాది అది 152 డాలర్ల స్థాయిలో ఉన్నదని వివరించారు.

**దేశీయ విమానయానంపై దెబ్బ**

పెరుగుతున్న ముడి చమురు ధరలతో ఇప్పటికే దేశీయ విమానయాన రంగం తీవ్రంగా దెబ్బతిన్నది. ఎయిర్ ఇండియా మరికొన్ని సంస్థలు ఆయా మార్గాల్లో విమానాల సంఖ్యను తగ్గించేశాయి. ఈ క్రమంలో ఇంధన ధరలు ఇంకా పెరిగితే ప్రధాన మార్గాల్లో తప్ప మిగతా రూట్లలో విమానాల రాకపోకలు నిలిచిపోయే అవకాశాలూ లేకపోలేదన్న అభిప్రాయాలు ఇండస్ట్రీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. కాగా, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్ సంస్థలు ఐఏటీఏలో భాగంగానే ఉన్నాయి.

# అమెరికా వీసా ఇంటర్వ్యూకు అదనపు బాదుడు..

**హైదరాబాద్ :** ప్రస్తుత వీసా విధానంలో సాధారణ అపాయింట్‌మెంట్ కోసం ఆరు నెలల నుంచి ఏడాదికి పైగా వేచి చూడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పది రోజుల్లోనే ఇంటర్వ్యూ స్లాట్ దక్కించుకోవడానికి ఈ అదనపు రుసుము చెల్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. అమెరికా ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఈ 750 డాలర్ల రుసుము కేవలం ఇంటర్వ్యూ తేదీని మాత్రమే ఖరారు చేస్తుంది. దీనివల్ల వీసా వస్తుందనే గ్యారెంటీ ఏమాత్రం ఉండదని అధికారులు స్పష్టం చేశారు. ఒకవేళ ఇంటర్వ్యూకు హాజరు కాకపోయినా లేదా వీసా తిరస్కరణకు గురైనా ఈ డబ్బును తిరిగి ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఇప్పటికే ఉన్న సాధారణ వీసా ఫీజు 185 డాలర్లతో పాటు జనవరి నుంచి అమల్లోకి వచ్చిన వీసా ఇంటెగ్రిటీ ఫీజు 250 డాలర్లు అదనం. వీటన్నింటికీ తోడు ఇతర ఛార్జీలు కూడా కలిపితే విమానం ఎక్కకముందే ఒక్కో దరఖాస్తుదారుడికి లక్షా 16 వేల రూపాయలకు పైగా




ఖర్చవుతుంది. హైదరాబాద్ లేదా ముంబై నుంచి విమాన టికెట్ల ఖర్చు కూడా కలిపితే మొత్తం రెండు లక్షల రూపాయలు దాటుతుంది. అమెరికా ఎంబసీకి చెందిన అధికారిక వీసా పోర్టల్ మే నెలలో సాంకేతిక లోపాలతో ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయింది. దీనివల్ల భారతదేశంతో పాటు మెక్సికో, ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లో వేలాది మంది దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వ్యవస్థలోని లోపాల వల్ల పెరిగిన రద్దీని తగ్గించేందుకు వాషింగ్టన్ ఈ అదనపు వసూళ్ల మార్గాన్ని ఎంచుకుంది. ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీసా ఖర్చులు గడిచిన ఏడాదిలో రెండున్నర రెట్లు పెరిగాయి. దీనివల్ల ముఖ్యంగా అమెరికాలో స్థిరపడిన పిల్లలను చూసేందుకు వెళ్లే భారతీయ వృద్ధులకు పెద్ద సమస్యగా మారింది. పదవీ విరమణ చేసి పరిమిత ఆదాయంతో జీవించే వృద్ధ తల్లిదండ్రులకు ఈ అదనపు భారం మోయలేనిదిగా తయారైంది. ఒకవేళ వీసా రాకపోతే ఈ భారీ మొత్తం పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. జూలై ఒకటిన ఏయే నగరాల్లోని కాన్సులేట్లలో ఈ సదుపాయం అందుబాటులోకి వస్తుందో అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటించనున్నారు. నిబంధనలు కఠినతరం కావడంతో పాటు ఖర్చులు విపరీతంగా పెరగడం మధ్యతరగతి ప్రయాణికులకు పెద్ద శరాఘాతంగా మారింది.

# ఆస్ట్రేలియాపై బంగ్లాదేశ్ సంచలన విజయం

ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియాకు పసికూన బంగ్లాదేశ్ ఊహించని షాకిచ్చింది. స్వదేశంలో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా ఇవాళ (జూన్ 9) జరిగిన తొలి మ్యాచ్‌లో 86 పరుగుల తేడాతో సంచలన విజయం (డక్‌వర్త్ లూయిస్) సాధించింది. తద్వారా సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. 36 ఏళ్ల చరిత్రలో బంగ్లాదేశ్ ఆస్ట్రేలియాపై వన్డేల్లో విజయం సాధించడం ఇది రెండోసారి మాత్రమే. 2005లో కార్డిఫ్‌లో జరిగిన మ్యాచ్‌లో తొలిసారి బంగ్లా జట్టు ఆసీస్‌కు షాకిచ్చింది. ఢాకాలోని షేర్-ఏ-బంగ్లా స్టేడియం వేదికగా జరిగిన తాజా మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్.. ఆరో నంబర్ ఆటగాడు మొసద్దెక్ హొస్సేన్ (86 నాటౌట్) సంచలన ఇన్నింగ్స్ ఆడటంతో నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. బంగ్లా ఇన్నింగ్స్‌లో తంజిద్ హసన్ తమీమ్ (54), నజ్ముల్ హొస్సేన్ షాంటో (67) కూడా అర్ధ సెంచరీలతో రాణించారు. తౌహిద్ హృదోయ్ (31), తస్కిన్ అహ్మద్ (20) ఓ మోస్తరు స్కోర్లతో పర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో నాథన్ ఇల్లిస్ (10-1-38-3) అద్భుతంగా బౌలింగ్ చేయగా.. లియామ్ స్కాట్, మ్యాట్ రెన్షా తలో 2 వికెట్లతో పర్వాలేదనిపించారు. బార్ట్‌లెట్‌కు ఓ వికెట్ దక్కింది. లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. కామెరూన్ గ్రీన్ (52) ఒక్కడే అర్ధశతకంతో పోరాడగా.. మిగతా బ్యాటర్లు నిరాశపరిచారు. బంగ్లాదేశ్ పేసర్ నహీద్ రాణా (10-1-




41-4) దెబ్బకు కంగారూలు కంగారు పడిపోయారు. బ్యాటింగ్‌లో సత్తా చాటిన మొసద్దెక్ (10-1-37-2) బౌలింగ్‌లోనూ చెలరేగడంతో ఆస్ట్రేలియా 42.2 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. ఈ దశలో వర్షం? అంతరాయం కలిగించడంతో డీఎల్ఎస్ పద్ధతిలో బంగ్లాదేశ్‌ను విజేతగా ప్రకటించారు. బంగ్లా బౌలర్లలో ముస్తాఫిజుర్ (5.2-0-24-2), తస్కిన్ (5-0-28-1) కూడా రాణించారు.

## స్పోర్ట్స్

# గైక్వాడ్ సూపర్ సెంచరీ.. ఉత్కంఠ పోరులో టీమిండియా గెలుపు




శ్రీలంకలో జరుగుతున్న ఏ-జట్ల ముక్కోణపు టోర్నీలో టీమిండియా బోణీ కొట్టింది. డంబుల్లా వేదికగా శ్రీలంక-ఏతో ఇవాళ (జూన్ 9) జరిగిన మ్యాచ్‌లో 8 పరుగుల తేడాతో థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. రుతురాజ్ గైక్వాడ్ (101) సూపర్ సెంచరీతో, కెప్టెన్ తిలక్ వర్మ (60) బాధ్యతాయుతమైన అర్ధ సెంచరీతో రాణించడంతో నిర్ణీత 50 ఓ?వర్లలో 6 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఆఖర్లో ఆయుశ్ బదోని (24), సూర్యాంశ్ షేడ్గే (26 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌లతో అలరించారు. మిగతా ఆటగాళ్లలో ప్రియాంశ్ ఆర్య 32, ప్రభ్‌సిమ్రన్ సింగ్ 2, అనుకూల్ రాయ్ 1 (నాటౌట్) పరుగు చేయగా.. ఐపీఎల్ 2026 తర్వాత భారీ అంచనాల నడుమ బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ 14 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు.

లంక బౌలర్లలో మొహమ్మద్ షిరాజ్ 2 వికెట్లు తీయగా.. కరుణరత్నే, సంకేత్, వనుజ సహాన్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం 278 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక, సాహన్ అరచ్చిగే (74), నిరోషన్ డిక్వెల్లా (47), సమరవిక్రమ (46) రాణించడంతో ఓ దశలో (262/6) గెలుపు దిశగా దూసుకెళ్లింది. అయితే చివరి రెండు ఓవర్లలో (7 పరుగుల వ్యవధిలో) కేవలం 10 పరుగులు అవసరమైన సమయంలో శ్రీలంక వరుసగా నాలుగు వికెట్లు కోల్పోయి 269 పరుగులకే ఆలౌటై, ఓటమిపాలైంది. అర్షద్ ఖాన్, ఆయుష్ బదోని, అనుకూల్ రాయ్, విప్రాజ్ నిగమ్ తలో రెండు వికెట్లు తీయగా, అన్షుల్ కంబోజ్ ఓ వికెట్ పడగొట్టింది. జూన్ 11న జరిగే తదుపరి మ్యాచ్‌లో భారత్-ఏ, ఆఫ్ఘనిస్తాన్-ఏ తలపడనున్నాయి.

# నైట్‌క్లబ్ వివాదం.. స్టోక్స్ కెరీర్‌కు ఎండ్ కార్డ్..?

ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ భవిష్యత్తుపై సంచలన ప్రచారం జరుగుతోంది. తాజాగా న్యూజిలాండ్‌పై లార్డ్స్ టెస్టులో ఘన విజయం సాధించిన తర్వాత స్టోక్స్, సహచర ఆటగాడు గస్ అట్కిన్సన్ జట్టు నిబంధనలను ఉల్లంఘించి అర్ధరాత్రి కర్ఫ్యూ సమయంలో ఓ నైట్‌క్లబ్‌లో ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్కడ వారు ఫుల్లుగా తాగి ఓ రగ్బీ ఆటగాడిపై దాడి చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ వివాదం తర్వాత స్టోక్స్ తన కెరీర్‌కు ముగింపు పలకాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. 'ది క్రికెటర్' సీనియర్ జర్నలిస్ట్ జార్జ్ దోబెల్ ప్రకారం.. అతడు స్వచ్ఛందంగా కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో పాటు రిటైర్మెంట్ కూడా ప్రకటించవచ్చు. అయితే దీనిపై అధికారిక ప్రకటన లేదు. ఇదిలా ఉంటే, నైట్‌క్లబ్ ఘటనలో స్టోక్స్, అట్కిన్సన్ ఎవరిపై దాడికి పాల్పడలేదని జుజదీ వర్గాలు చెబుతున్నాయి. అయినప్పటికీ కర్ఫ్యూ నిబంధనలు ఉల్లంఘించినందుకు వారిపై చర్యలు తప్పకపోవచ్చు. స్టోక్స్‌కు ఇలాంటి సంఘటనలు కొత్తేమీ కాదు. గతంలోనూ పీకల దాకా తాగి రచ్చ చేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. గతేడాది నవంబర్‌లో ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా ఇలాగే నైట్‌క్లబ్ వివాదంలో చిక్కుకున్నాడు. న్యూజిలాండ్‌తో వన్డే మ్యాచ్‌కు ముందు వెల్లింగ్టన్‌లోని ఓ నైట్‌క్లబ్‌కు వెళ్లిన బ్రూక్, అక్కడ బౌన్సర్‌తో వాగ్వాదానికి దిగాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఇంగ్లండ్




భవిష్యత్తు ఆశాకిరణం జేకబ్ బెథెల్‌తో కలిసి సదరు బౌన్సర్‌పై దాడి చేశాడు. అయితే దాడి పెద్దది కాకపోవడంతో ఈసీబీ వారిద్దరిని మందలింపుతో సరిపెట్టింది.




## నాని ‘ది పారడైజ్’ మళ్లీ వాయిదా? రవితేజ ‘ఇరుముడి’ కోసమేనా!

నాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ‘ది పారడైజ్’ మరోసారి వాయిదా పడే దిశగా కనిపిస్తోంది. మొదట మార్చి 26న విడుదల కావాల్సిన ఈ చిత్రం, ఆ తర్వాత ఆగస్టు 21కి వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఆ ఆగస్టు 21వ తేదీని మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న ‘ఇరుముడి’ సినిమా లాక్ చేసుకోవడంతో నాని సినిమా పోస్ట్‌పోన్ కాక తప్పని పరిస్థితి ఏర్పడింది. సినిమాకు సంబంధించిన కొంత వర్క్ ఇంకా పెండింగ్‌లో ఉండటమే ఈ ఆలస్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. సోషల్ మీడియాలో వినిపిస్తున్న తాజా సమాచారం ప్రకారం.. ‘ది పారడైజ్’ చిత్రం సెప్టెంబర్ నెలలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఇది కేవలం ప్రచారం మాత్రమేనని, దీనిపై చిత్ర యూనిట్ నుండి అధికారిక ప్రకటన రావాల్సి ఉందని ఇండస్ట్రీ టాక్. బ్లాక్‌బస్టర్ ‘దసరా’ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ‘ది పారడైజ్’ పై భారీ అంచనాలు ఉన్నాయి. ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో కాయాదు లోహర్ హీరోయిన్ గా నటిస్తుండగా, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నాడు.

# ‘పెద్ది’కి మళ్లీ రిపేర్లు.. సెకండాఫ్‌లో కీలక మార్పులు, కొత్త వెర్షన్ సిద్ధం!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ‘పెద్ది’ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతున్నప్పటికీ, సినిమా కంటెంట్ విషయంలో వచ్చిన విమర్శలను మేకర్స్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చిన నేపథ్యంలో దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని మరింత మెరుగుపరచే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే జాన్వీ కపూర్ పాత్రకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు గురయ్యాయి. హీరోయిన్‌ను చూపించిన తీరు, కొన్ని షాట్లపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో దర్శకుడు బుచ్చిబాబు క్షమాపణలు చెబుతూ ఆ సన్నివేశాలను తొలగించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం థియేటర్లలో ఆ మార్పులతో కూడిన వెర్షన్ ప్రదర్శితమవుతోంది. అయితే తాజా సమాచారం ప్రకారం, ‘పెద్ది’లో మార్పులు అక్కడితో ఆగలేదని తెలుస్తోంది. ముఖ్యంగా సెకండాఫ్ నిడివి, కథనం వేగంపై ప్రేక్షకుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను దృష్టిలో పెట్టుకుని మరిన్ని ఎడిటింగ్ మార్పులు చేయాలని చిత్రబృందం నిర్ణయించినట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో సెకండాఫ్‌లో వచ్చే కొన్ని ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్‌ను తగ్గించి, వాటి స్థానంలో రామ్ చరణ్ మరియు జగపతి బాబు పాత్రల మధ్య భావోద్వేగపూరిత సన్నివేశాలను జోడించే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని సమాచారం. ఈ మార్పులతో కథ మరింత బలంగా, భావోద్వేగంగా కనెక్ట్ అవుతుందని భావిస్తున్నారట. అలాగే సినిమాలోని కొన్ని నెమ్మదిగా సాగిన భాగాలను కత్తిరించి, కథనాన్ని మరింత రేసీగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రేక్షకుల దృష్టిని నిలబెట్టేలా సెకండాఫ్‌ను మరింత గ్రిప్పింగ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ మార్పులు చేస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఎడిటింగ్ పనులు పూర్తయిన తర్వాత చిత్రానికి మళ్లీ సెన్సార్ అనుమతి తీసుకుని, కొత్త వెర్షన్‌ను థియేటర్లలో ప్రదర్శించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. వీలైనంత త్వరగా, ముఖ్యంగా వచ్చే వీకెండ్‌కు ముందే ఈ అప్‌డేటెడ్ వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, మిశ్రమ టాక్ వచ్చినప్పటికీ ‘పెద్ది’ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు నమోదు చేస్తూ ముందుకు సాగుతోంది. ఇప్పుడు ఈ కొత్త మార్పులు సినిమాకు మరింత బలాన్ని చేకూరుస్తాయా? కలెక్షన్లపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

## దేశ విభజన నేపథ్యంలో సన్నీ డియోల్ ‘బట్వారా 1947’.. విడుదల తేదీ ఖరారు!





బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా చిత్రం నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఇప్పటివరకు ‘లాహోర్ 1947’ అనే వర్కింగ్ టైటిల్‌తో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా పేరును అధికారికంగా ‘బట్వారా 1947’ గా మారుస్తూ చిత్రబృందం సరికొత్త మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే ఈ భావోద్వేగభరితమైన చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా 2026, ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో ‘ఘాయల్’, ‘దామిని’, ‘ఘాతక్’ వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన ‘ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్’ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.

# వీడి అనుమానంలో మనం విడిపోయేలా ఉన్నాం’



యంగ్ హీరో రాగ్ మయూర్ నటించిన లేటేస్ట్ సైకాలాజికల్ కామెడీ ఎంటర్‌టైనర్ అనుమాన పక్షి. ఈ సినిమాకు విమల్ కృష్ణ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని రాజీవ్ చిలకా, రాజేశ్ జగ్తియాని, హిరాచంద్ దండ్ నిర్మించారు. ఈ చిత్రంలో మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటించింది. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. తాజాగా రిలీజైన టీజర్ చూస్తుంటే ప్రతి విషయానికి అనుమానపడే వ్యక్తిగా హీరో రాగ్ మయూర్ కనిపించారు. ప్రతిదాన్ని అనుమానించే హీరో పెళ్లి విషయంలో ఏం చేశారనే నేపథ్యంలోనే ఈ మూవీని తెరకెక్కించినట్లు అర్థమవుతోంది. ఈ మూవీలో ప్రిన్స్, అనన్య, చరిత్, బ్రహ్మాజీ, రాశి, ?అజయ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జూలై 10న థియేటర్లలో సందడి చేయనుంది.





## నాగ చైతన్య సూపర్ హిట్ థ్రిల్లర్ సిరీస్‌పై క్రేజీ బజ్ ..

### ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ జత కట్టిన క్రేజీ కాంబో

అక్కినేని యువ హీరో నాగ చైతన్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఒకవైపు భారీ థ్రిల్లర్ మూవీ ‘వృష కర్మ’లో నటిస్తూనే, మరోవైపు తన కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఓటీటీ సిరీస్ ‘దూత’ రెండో సీజన్ కోసం కూడా సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అధికారికంగా ప్రారంభమైన ‘దూత 2’పై రోజురోజుకు ఆసక్తికరమైన వార్తలు వెలుగులోకి వస్తున్నాయి. దర్శకుడు విక్రమ్ కె కుమార్ తెరకెక్కించిన ‘దూత’ తొలి సీజన్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణను సొంతం చేసుకుంది. హారర్, మిస్టరీ, థ్రిల్లర్ అంశాల కలయికతో రూపొందిన ఈ సిరీస్ ఓటీటీ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా, నాగ చైతన్యకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఇప్పుడు రెండో సీజన్ మరింత భారీ స్థాయిలో తెరకెక్కనున్నట్లు సమాచారం. తాజాగా సినీ వర్గాల్లో వినిపిస్తున్న వార్తల ప్రకారం, ప్రముఖ నటి భూమిక చావ్లా ‘దూత 2’లో కీలక పాత్ర పోషించనున్నారట. ఈ విషయంపై అధికారిక ప్రకటన రానప్పటికీ, భూమిక పాత్ర కథలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే, నాగ చైతన్య-భూమిక కాంబినేషన్ మరోసారి ప్రేక్షకులను అలరించనుంది. ఇప్పటికే 2018లో వచ్చిన ‘సవ్యసాచి’ చిత్రంలో నాగ చైతన్యతో కలిసి నటించిన భూమిక, ఇప్పుడు ‘దూత 2’లో మరో ఆసక్తికరమైన పాత్రలో కనిపించబోతున్నారని టాక్. ఆమె పాత్ర కథనంలో కీలక మలుపులకు కారణమవుతుందని కూడా సినీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి సీజన్‌లో ప్రింట్ మీడియా, వార్తాపత్రికల నేపథ్యంలో సాగే భయానక మిస్టరీని దర్శకుడు విక్రమ్ కె కుమార్ అద్భుతంగా చూపించారు. జరగబోయే ఘటనలను ముందుగానే చెప్పే వార్తాపత్రికల కాన్సెప్ట్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు రెండో సీజన్‌లో పూర్తిగా కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి దర్శకుడు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అత్యాధునిక టెక్నాలజీ, డిజిటల్ ప్రపంచం లేదా మరొక వినూత్నమైన అంశాన్ని కథలో భాగం చేయనున్నారనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే మేకర్స్ మాత్రం కథకు సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. ఇక ఈ సిరీస్ మరో ప్రత్యేకత ఏమిటంటే, నాగ చైతన్య కేవలం హీరోగానే కాకుండా నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన కెరీర్‌లో నిర్మాతగా ప్రారంభించిన తొలి ప్రాజెక్ట్ ‘దూత 2’ కావడం విశేషం. దీంతో ఈ సిరీస్‌పై చైతన్య ప్రత్యేక శ్రద్ధ పెట్టుతున్నట్లు సమాచారం.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713